ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

సూర్యాపేట

3

సోమవారం 6 మే 2024



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442

యాదాద్రి : 1800 425 7106

సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.151	219	249
సూర్యాపేట	రూ.150	220	250
నల్లగొండ	రూ.149	230	250

ఉష్ణోగ్రత గరిష్ఠం 43.0 । కనిష్ఠం 26.4

ఉక్కిరి బిక్కిరి



మధ్యాహ్నం వేళ నల్లగొండ జిల్లాకేంద్రంలో నిర్మానుష్యంగా మారిన ప్రధాన రహదారి

ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రజలు ఎండలతో ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. ఎండల తీవ్రతకు తట్టుకోలేక ఇంటినుంచి బయటకు రావడం లేదు. అయితే ఆదివారం మాత్రం కాస్త ఉపశమనం లభించింది. ఉదయం నుంచి దంచికొట్టిన ఎండలకు తెరిపినిస్తూ వాతావరణం చల్లబడింది. ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. గాలి దుమారానికి మామిడి తోటల్లో కాయలు రాలిపోయాయి. చేతికొచ్చిన కాయలు రాలిపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈదురుగాలులకు పలు చోట్ల ఇళ్ల పైకప్పులు ఎగిసిపడ్డాయి. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పిడుగుపడి ఒకరు మృతి చెందారు. నల్లగొండ జిల్లాలోని పీఏపల్లి, తిప్పర్తి మండలాల్లో 47.8మి.మీలు వర్షపాతం నమోదైంది.

5

ఉపశమనం



సాయంత్రవేళ వర్షంతో జిల్లాకేంద్రంలోని క్లాక్‌టవర్ సెంటర్‌లో కురుస్తున్న వాన

డిగ్రీ ప్రవేశాలకు

దోస్త్

- నేటినుంచి ఆన్‌లైన్‌లో ప్రక్రియ ప్రారంభం
- ఉమ్మడి జిల్లాలో 75 డిగ్రీ కళాశాలలు



దోస్త్ విధానంలో నేటి నుంచి అడ్మిషన్లు ప్రారంభం కానున్నాయి. మూడు దశల్లో ఈ ప్రక్రియ కొనసాగనుంది. ఇవి పూర్తయిన తర్వాత జూలై 7వ తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయి. దరఖాస్తులు, వెబ్ ఆప్షన్స్, సీట్ల కేటాయింపు ఆన్‌లైన్‌లోనే ఉంటుంది. దోస్త్ ప్రక్రియ ప్రారంభం కావడంతో నచ్చిన కళాశాల, నచ్చిన కోర్సులో చేరేందుకు విద్యార్థులు అవగాహనతో వ్యవహరించాలని నిపుణులు సూచిస్తున్నారు. కేవలం వృత్తి విద్యా కోర్సులను మాత్రమే చదువాలనే మూస ధోరణి వీడి డిగ్రీలోనూ ఉత్తమ కోర్సులను ఎంపిక చేసుకోగలిగితే భవిష్యత్ భద్రంగా ఉంటుందని సూచిస్తున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 75 ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ డిగ్రీ కళాశాలల్లో పలు కోర్సుల్లో 26,040 సీట్లు అందుబాటులో ఉన్నాయి.

● భువనగిరి టౌన్

5

వేసవి నుంచి ఉపశమనం కోసం కూలర్లు, ఏసీల వినియోగం పెరిగింది. ఫలితంగా విద్యుత్ వాడకం పెరిగి, డిమాండ్ కూడా అదే స్థాయిలో గరిష్ఠానికి చేరింది. గతేడాది కంటే ఈ సారి ఎండల తీవ్రత అధికంగా ఉండడంతో ప్రజలు ఇంటి నుంచి బయటకు వెళ్లడంలేదు. దీంతో ఇంట్లో ఫ్యాన్లకు బదులు ఏసీలు, కూలర్లు వినియోగిస్తుండడంతో జిల్లావ్యాప్తంగా విద్యుత్ వినియోగం 40 శాతం అదనంగా పెరిగింది. ట్రాన్స్‌ఫార్మర్లపై అదనపు భారం పడుతుండడంతో అందకనుగుణంగా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది.

- నల్లగొండ/నల్లగొండ టౌన్



పవర్ ఫుల్ డిమాండ్

- ఎండల తీవ్రతే కారణం
- గృహాల్లో కూలర్లు, ఏసీల వాడకం
- రెడ్ అలర్ట్ జారీతో ఇంటికే పరిమితమవుతున్న ప్రజలు
- గతేడాది కంటే వేసవిలో 40శాతం అదనపు విద్యుత్

ఉమ్మడి నల్లగొండ జిల్లావ్యాప్తంగా ఎండలు మండిపోతుండటంతో అంతకంతకు విద్యుత్ వినియోగం కూడా పెరిగిపోతోంది. మూడు జిల్లాల్లోనూ 46 డిగ్రీలకు పైగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. గత ఏడాదికి భిన్నంగా ఈ ఏడాది మార్చి మొదటి వారం నుంచే ఎండలు పెరిగిన విషయం తెలిసిందే. ఇక ఏప్రిల్ నుంచి అయితే రెడ్ అలర్ట్ జారీ అయిన ప్రాంతాలు అత్యధికంగా ఉన్నాయి. ఇక రోజు రోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి తప్ప తగ్గడం లేదు. ఆదివారం సగటున 43 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కాగా, మండలాల వారీగా అత్యధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతూనే ఉన్నాయి. దీంతో ప్రజలు ఎండను భరించలేక కూలర్లను, ఆర్థికంగా ఉన్నవారు ఏసీలను వినియోగిస్తున్నారు. సాధారణ ఫ్యాన్లు వేయడం లేదు. వేసినా వేడి గాలులతో ఉడికిపోతున్నారు. కూలర్లు, ఏసీలు సైతం ఒకానొక సమయంలో అత్యధిక ఎండలకు చల్లటి గాలిని ఇవ్వడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఆదివారం నల్లగొండ జిల్లా నాంపల్లిలో అత్యధికంగా 46.1డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయింది. మిగతా అన్ని మండలాల్లో 44డిగ్రీల నుంచి 45డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

ఉమ్మడి జిల్లాలో 40 శాతం పెరిగిన విద్యుత్ వినియోగం

నల్లగొండ జిల్లాలో వ్యవసాయ, గృహ, వాణిజ్య, పరిశ్రమలు, వీధి దీపాలు, వాటర్ వర్క్స్, ఇతర వినియోగదారులన్నీ కలిపి 7,66,107 విద్యుత్ కనెక్షన్లున్నాయి. యాదాద్రి భువనగిరి జిల్లాలో మొత్తం అన్ని కేటగిరీలు కలిపి 4,19,847 కనెక్షన్లుండగా, సూర్యాపేట జిల్లాలో అన్ని కలిపి మొత్తం 4,84,596 కనెక్షన్లున్నాయి. ఇక ప్రస్తుతం వ్యవసాయ రంగానికి పెద్దగా విద్యుత్ వినియోగంలేదు. దాదాపు వరి పంట కోతలు ముగిశాయి. కేవలం పండ్ల తోటలు, కూరగాయల సాగుకు మాత్రమే విద్యుత్ వినియోగం ఉంది. గతేడాది మే నెల మొదటి వారంలో నాలుగు రోజుల విద్యుత్ వినియోగాన్ని, ప్రస్తుత మేనెలలోని నాలుగు రోజుల విద్యుత్ వినియోగాన్ని పరిశీలిస్తే 40 శాతం అదనంగా విద్యుత్ వాడకం జరుగుతుంది. ఒక ఫీడర్‌కు 100 హామ్స్ కెపాసిటీ ఉండగా, అది కాస్త 200 హామ్స్‌కు చేరిపోతుంది. అంటే ఆయా ఫీడర్లపై డబల్ భారం పడుతుంది. దీంతో చాలా ప్రాంతాల్లో గృహ వినియోగానికి సంబంధించి తరచూ అంతరాయం కలుగుతుంది. గంటల కొద్ది కరెంట్ పోనప్పటికీ పదే పదే ట్రిప్పు అవుతుండటంతో గృహ విద్యుత్ వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నా రు. ఒక ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సుమారు 45 వేలకు పైగా సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్లు ఉం డగా, లక్షా20వేలకు పైగా త్రీఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ల ద్వారా ఆయా కేటగిరీలకు విద్యుత్ సరఫరా జరుగుతుంది.

గతేడాది మేతో పోలిస్తే ఈ ఏడాది

మేలో విద్యుత్ డిమాండ్ ఇలా..

తేదీ	గత ఏడాది డిమాండ్ (మిలియన్ యూనిట్లలో)	ఈ ఏడాది డిమాండ్ (మిలియన్ యూనిట్లలో)
మే1	7.63	10.97
మే2	7.93	10.51
మే3	8.16	10.86
మే4	8.19	10.98

విద్యుత్ వినియోగం విపరీతంగా పెరిగింది


రోజురోజుకు పగటి ఉష్ణోగ్రతలు అధికమవుతుండటంతో విద్యుత్ వినియోగం కూడా విపరీతంగా పెరుగుతుంది. ముఖ్యంగా గృహ అవసరాలకు విద్యుత్ డిమాండ్ విపరీతంగా ఉంటుంది. గతేడాదితో పోలిస్తే 40శాతానికి పైగా అధికంగా విద్యుత్ వినియోగం జరుగుతుంది. అయితే విద్యుత్ వినియోగానికి అనుగుణంగా విద్యుత్‌ను సరఫరా చేస్తున్నాం. డిమాండ్ పెరుగుతున్న కొద్ది అందుకనుగుణంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం కూడా పెంచుతున్నాం. ఇందుకోసం ఇప్పటికే జిల్లావ్యాప్తంగా 100కు పైగా కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశాం. విద్యుత్ డిమాండ్ ఉన్నప్పటికీ సరఫరాలో ఎలాంటి అంతరాయాలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నాం.

- ఎస్ఈ చంద్రమోహన్, నల్లగొండ

డిమాండ్‌కనుగుణంగా విద్యుత్ సరఫరాపై దృష్టి

రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ సరఫరా విషయంలో డిమాండ్‌కనుగుణంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించిన విషయం తెలిసిందే. గత ప్రభుత్వ హయాంలో విద్యుత్ సరఫరా జరిగిన మాదిరిగానే ప్రస్తుతం కూడా విద్యుత్ సరఫరాను ఎలాంటి అంతరాయం లేకుండా చూడటం కోసం విద్యుత్ శాఖతోపాటు ప్రభుత్వం దృష్టిసారించింది. గతేడాది మే నెల 4వ తేదీన 8.19 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను సరఫరా చేయగా ఈ ఏడాది మేలో అదే రోజు 10.98 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను సరఫరా చేశారు. అంటే ప్రస్తుతం రోజుకు సుమారు 2.84 మిలియన్ యూనిట్ల విద్యుత్ చొప్పున వినియోగదారులకు సరఫరా చేస్తున్నారని చెప్పవచ్చు. ఎన్నడూ లేని విధంగా ఎండలు రోజురోజుకూ పెరిగిపోవడంతో వినియోగదారులు ఉక్కపోతను, వేడి వాతావరణాన్ని తట్టుకోలేక కూలర్లు, ఏసీలను అత్యధికంగా వినియోగిస్తున్నారు. విద్యుత్‌బిల్లు అధికంగా వచ్చినప్పటికీ ఎండల తీవ్రతను తట్టుకోలేక రోగాల బారిన పడుతామని, వడదెబ్బకు ప్రాణాలు కూడా పోతాయన్నా భయాందోళనతో కూలర్, ఏసీలు వాడుతున్నారు. దీంతో విద్యుత్‌కు డిమాండ్ పెరగడం, అందుకనుగుణంగా విద్యుత్‌శాఖ ఆంటకంలేకుండా సరఫరా చేయడానికి చర్యలు తీసుకుంటుందని చెప్పవచ్చు. ఇదిలా ఉంటే రెడ్ అలర్ట్ జారీ అవుతుండటంతో ప్రజలు ఇళ్లకే పరిమితమవుతుండటంతో విద్యుత్ వినియోగం పెరుగుతుంది.

ఆరేళ్ల తర్వాత కనిష్ఠస్థాయికి సాగర్



అడుగంటిన సాగర్ ప్రాజెక్ట్

- సాగర్‌లో మరో నాలుగు అడుగులు మాత్రమే తోడుకునే అవకాశం
- మూసీ ప్రాజెక్ట్‌లోనూ నీటి లభ్యత అంతంతమాత్రమే

సకాలంలో వర్షాలు కురవక, కురిసిన చోట సరిపోక భూగర్భజలాలు అడుగంటాయి. ఎగువ నుంచి నీటి వరద లేకపోవడంతో జిల్లాలోని ప్రధాన ప్రాజెక్ట్‌లు వెలవెలబోతున్నాయి. తెలుగు రాష్ట్రాల అన్నపూర్ణ నాగార్జునసాగర్ నుంచి మరో నాలుగు అడుగుల మేర నీటిని తోడుకునే అవకాశం మాత్రమే ఉండడంతో, తర్వాత పరిస్థి తి ఏమిటన్న దానిపై ఆందోళన మొదలైంది. ఆరే ళ్ల తర్వాత నాగార్జునసాగర్‌లో నీటి మట్టం ఈ స్థాయికి చేరడం ఆందోళన కలిగించే విషయం. వీటికి తోడు సూర్యాపేట జిల్లాలో నీటిని ఒడిసి పట్టేందుకు నిర్మించ తలపెట్టిన చెక్‌డ్యాంల నిర్మాణం మధ్యలోనే నిలిచిపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నాగార్జునసాగర్, మే5: నాగార్జునసాగర్ ప్రాజెక్టు నీటిమట్టం ఆరే ళ్ల తర్వాత కనిష్ఠస్థాయి (510 అడుగులు) దిగువకు చేరింది. ఈ ఏడాది కృష్ణా బేసిన్‌లో సరిపడా వర్షాలు కురవకపోవడంతో కృష్ణా పరివాహక ప్రాంతంలో ప్రాజెక్టులన్నింటిలో నీటినిల్వలు తక్కువగా నమోదయ్యాయి. దీంతో ఈ నీటి సంవత్సరంలో సాగర్ ప్రాజెక్టు పరిధిలో రెండు తెలుగు రాష్ట్రాల్లో ఖరీఫ్‌తోపాటు, రబీకి కూడా సా గు నీటిని అందించలేదు. దీంతో క్రాప్ హాలీడే ప్రకటించారు. ఆరేళ్ల క్రితం 2018లో ఇదే రోజున సాగర్ నీటిమట్టం 504(122.0480టీఎంసీలు) అడుగులుగా ఉంది. తిరిగి ఆరేళ్ల తర్వాత ప్రస్తుతం సాగర్ నీటి మట్టం 504.90 అడుగులకు (123.1741టీఎంసీలు) చేరింది. గతేడాది ఇదే రోజున సాగర్ నీటి మట్టం 522అడుగులు (152. 9740టీఎంఈసలు)గా ఉంది. సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమ ట్టం 590 అడుగులు (312.5050టీఎంసీలు) కాగా, ప్రస్తుతం 504. 90 అడుగులు (123.1741టీఎంసీలు)గా ఉంది. సాగర్ నుంచి ఏఎమ్మార్పీ ద్వారా జంట నగరాల తాగు నీటి అవసరాలకు 400 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి కుడి, ఎడమ, వరద కాల్వలకు, ప్రధాన జల విద్యుత్ కేంద్రానికి ఎలాంటి నీటి విడుదలలేదు. ఎగువ నుంచి సాగర్‌కు ఎలాంటి నీటి రాక లేదు.

మరో 4.90 అడుగులు తోడుకునే అవకాశం

సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 590 అడుగులు కాగా, కనిష్ఠ స్థాయి నీటి మట్టం 510 అడుగులు. కాగా ఈ ఏడాది వేసవి తాగునీటి అవసరాలకు నీటి లభ్యత తక్కువగా ఉండటంతో సాగర్ నుంచి తాగు నీటి అవసరాలకోసం 500 అడుగులు వరకు నీటిని వినియోగించుకోవచ్చని కేఆర్ఎంబీ రెండు తెలుగు రాష్ట్రాలకు తెలిపింది. ప్రస్తుతం సాగర్ నీటి మట్టం 504.90 అడుగులు మాత్రమే ఉంది. అంటే సాగర్ నుంచి మరో 4.90 అడుగుల నీటిని మాత్రమే వినియోగించుకునే అవకాశం ఉంది.



చెక్‌డ్యాంల నిర్మాణంలో జాప్యం



సూర్యాపేట మండలంలోని కెటీఅన్నారంలో పాతచెక్‌డ్యాంకు రాళ్లను ఊడదీసి దృశ్యం

భానుపురి: చెక్‌డ్యాంల నిర్మాణంతో భూగర్భజలాలు పెరుగుతాయన్న ఉద్దేశంతో గత ప్రభుత్వం రూ.కోట్లు కేటాయించింది. టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్లు పనులను చేయడంలో జాప్యం చేస్తున్నారు. ఓ కాంట్రాక్టర్ చెక్‌డ్యాంల నిర్మాణ పనులను పూర్తి చేయకపోవడం, కాంట్రాక్టర్ అందుబాటులోకి రావడం లేదని నీటిపారుదలశాఖ సిబ్బంది గుసగుసలాడుతున్నారు. 2020-21లో ఒక్కో చెక్‌డ్యాం నిర్మాణానికి రూ.6కోట్ల నుంచి రూ.7కోట్లు కేటాయించారు. సూర్యాపేట నియోజకర్గంలోనే 19 చెక్‌డ్యాంలను అప్పటి ప్రభుత్వం మంజూరు చేసింది. జీవో నెం.766లో మంజూరైన చెక్‌డ్యాంలను త్వరగా పూర్తి చేశారు. ఆత్మకూర్(ఎస్) మండలంలో 7 చెక్‌డ్యాంలు, సూర్యాపేట మండలంలో 6, పెన్‌పహాడ్ మండలంలో 6 చెక్‌డ్యాంలు మంజూరు కాగా,సీ5 కాంట్రాక్టర్‌కు ఆత్మకూర్(ఎస్)లో రెండు, సూర్యాపేట మండలంలో మూడు చెక్‌డ్యాంల నిర్మాణ పనులు దక్కాయి. సూర్యాపేట మండలంలోని మూడు చెక్‌డ్యాం పనులను పూర్తి చేయలేకపోయారు. యండ్లపల్లి మూసీ నదిపై నిర్మించిన చెక్‌డ్యాం పనులు ఇంకా 30శాతం చేయాల్సి ఉంది. అదే విధంగా కేటీ అన్నారం మూసీ నదిలో చెక్‌డ్యాం నిర్మాణానికి పనులే మొదలు పెట్టలేదు.

అసంపూర్తిగా భీమారం బ్రిడ్జి చెక్‌డ్యాం

కాసరబాద పరిధిలోని వెదిరెవారిగూడెం(బీమా రం బ్రిడ్జి)వద్ద చెక్‌డ్యాం పనులను 40శాతం మాత్రమే పూర్తిచేశారు. బాడీ వాల్‌ను కొంతమాత్రమే నిర్మాణంచేసి కాంట్రాక్టర్ వదిలేసి వెళ్లినట్లు అధికారులు చెబుతున్నా రు. 60శాతం పనులు చేయాల్సి ఉం ది. నీటి వరద ఎక్కువగా వస్తుందని, కారణం చెబుతూ ఆలస్యం చేస్తుండడం గమనార్హం. జీవో నెం.766 కింద 14 చెక్‌డ్యాంలను దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులు పూర్తిచేశారు. అయితే పెన్‌పహాడ్ మండలంలోని అనాజీపురం, సర్కిల్‌పేట పరిధిలో నిర్మించిన చెక్‌డ్యాం వద్ద బలహీనంగా కట్ట ఉండడంతో వరద ఎక్కువై తెగిపోయి ఓ రైతు పొలంలోకి నీరు చేరి నష్టంచేసింది.

సీ-5 కాంట్రాక్టర్ స్పందించం లేదు

సీ-5 కాంట్రాక్టర్ కొన్ని చోట్ల పనులను పూర్తి చేశారు. ఇంకా మూడు చోట్ల పనులు చేయాల్సి ఉంది. స్పందించడంలేదు. ఏమి చేయాలో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. అనాజీపురంలో చెక్‌డ్యాం కట్ట తెగిన విషయం నా దృష్టికి రాలేదు. ప్రతీ చెక్ డ్యాంనకు సంబంధించి 10 శాతం పనులు కావాల్సి ఉంది.

- శివ ధర్మతేజ, ఎస్ఈ, నీటిపారుదల శాఖ, సూర్యాపేట

625 అడుగులకు చేరిన మూసీ నీటిమట్టం

కేతేపల్లి, మే 5: ఉమ్మడి నల్లగొండ జిల్లాలో నాగార్జునసాగర్ తర్వాత రెండో పెద్ద నీటి వనరుగా ఉన్న మూసీ ప్రాజెక్టు నీటిమట్టం వేసవి ఎండలకు ఎదురీదుతూ 625 అడుగులకు చేరింది. 645 అడుగులు (4.46టీఎంసీలు) పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం గల మూసీ ప్రాజెక్టు నీటిమట్టం ప్రాజెక్టు ఆయకట్టుకు యాసంగి నీటి విడుదలను నిలిపి వేసే నాటికి 618అడుగుల కనిష్ఠ స్థాయికి పడిపోయింది. ఈక్రమంలో హైదరాబాద్, మూసీ పరిసరాల్లోని కంపెనీల నుంచి వచ్చే మురుగు, వృథా నీరంతా ఎగువ మూసీనుంచి ప్రాజెక్టులోకి వచ్చి చేరుతుంది. ఈక్రమంలో ఒక్కో పాయింటు చొప్పున పెరుగుతూ వచ్చిన ప్రాజెక్టు నీటిమట్టం 618అడుగుల నుంచి ఏడు అడుగులు పెరిగి ఆదివారం సాయంత్రానికి 625 అడుగులుగా నమోదయింది. ప్రస్తుతం ప్రాజెక్టు నీటిమట్టం 625.25 అడుగులు (0.86టీఎంసీలు)గా ఉంది. ఎగువ నుంచి 296 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. గతేడాది ఇదే సమయానికి ప్రాజెక్టు నీటిమట్టం 637.10 క్యూసెక్కులు (2.59టీఎంసీలు) ఉండగా ఇన్‌ఫ్లో 1,556 క్యూసెక్కులుగా ఉంది.



దేశంలో అధికారంలోకి

రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమే

మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రఘువీర్‌రెడ్డి



తిరుమలగిరిలో మాట్లాడుతున్న రఘువీర్‌రెడ్డి

తిరుమలగిరి(సాగర్), నాగార్జునసాగర్, మే 5: దేశంలో రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమేనని మాజీ సీఎల్పీ నేత కుందూరు జానారెడ్డి అన్నారు. ఆదివారం తిరుమలగిరి(సాగర్) మండలకేంద్రంలో నిర్వహించిన ప్రచార సభలో ఆయన ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి రఘువీర్‌రెడ్డితో కలిసి పాల్గొని మాట్లాడారు. దేశంలోనే అత్యధిక మెజారిటీతో గెలిపించాలన్నారు. స్థానిక ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలో రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమేనన్నా రు. రానున్న రోజుల్లో నెల్లికల్ లిఫ్టుకు అవసరమైన నిధులను సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి మంజూరు చేయించి త్వరలో లిఫ్టులను పూర్తిచేస్తామన్నారు. ఎంపీ అభ్యర్థి రఘువీర్‌రెడ్డి మాట్లాడుతూ తాను గెలిస్తే నియోజకవర్గంలో యువతకోసం రెండు పరిశ్రమలను మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు.కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్, నాయకులు కర్నాటి లింగారెడ్డి, తుమ్మలపల్లి శేఖర్‌రెడ్డి, శాగం పెద్దిరెడ్డి, గడ్డం సాగర్‌రెడ్డి, రాఘవరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రవాసీయులకు ద్వంద్వ పౌరసత్వం

ప్రవాసీయులకు ద్వంద్వ పౌరసత్వం తేవడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి అన్నారు. నాగార్జునసాగర్‌లోని తన నివాసం నుంచి ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రవాసీ తెలంగాణవాసులతో జూమ్ ద్వారా మాట్లాడారు. ఎన్ఆర్ఐల పాలసీని త్వరగా తీసుకువస్తానని, అలాగే ఎన్ఆర్ఐల భాగస్వామ్యంతో ఒక గ్రామాన్ని మోడల్‌గా చేయడమే లక్ష్యమన్నారు.



రాష్ట్రంలో ఒక్కరికి రైతు భరోసా ఇచ్చినా...

రాజీనామా చేస్తా

- కాంగ్రెస్ పాలనలో అప్పులపాలైన రైతులు
- మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి

6

ఈదురుగాలులు.. వర్ష బీభత్సం

- మూడు కిలోమీటర్ల మేర ట్రాఫిక్‌జామ్

5



ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై దాడి

మోత్కూరు, మే 5: మోత్కూరు నుంచి ఆదివారం రాత్రి నల్లగొండ వెళుతున్న ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై గుర్తు తెలియని వ్యక్తి దాడి చేసి గాయపర్చాడు. డ్రైవర్ శివరాత్రి ధనుంజయ తెలిపిన వివరాల ప్రకారం... మోత్కూరులో వర్షం కురిసి రోడ్డుపై గుంతల్లో నీరు నిలిచింది. నల్లగొండ డిపోకు చెందిన డ్రైవర్ ధనుంజయ ఆర్టీసీ బస్సు నడుపుకుంటూ నల్లగొండ వెళుతున్నాడు. అతని ముందు వెల్మినేడుకు చెందిన శ్రీనివాస్ బైక్‌పై వెళుతున్నాడు. బస్సు డ్రైవర్ హారన్ కొట్టాడు. అయినా బైక్‌పై వెళుతున్న శ్రీనివాస్ పక్కకు తప్పుకోక పోవడంతో డ్రైవర్ కూడా పక్కకు వెళ్లకుండా బస్సును నిలిపివేశాడు. దీంతో శ్రీనివాస్ డ్రైవర్‌ను తిడుతూ డ్రైవర్ సీటు పక్కన ఉన్న డోర్ తెరిచి కొట్టాడు. రాయితో నోసలు పై కొట్టడంతో గాయమైంది. ఆర్టీసీ డ్రైవర్ 100 కు ఫోన్ చేయడంతో పోలీసులు వచ్చి అతన్ని అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నారు.

దాహార్తి తీర్చని నీటి శుద్ధి యంత్రం

నార్కట్‌పల్లి, మే 5: నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లిలోని పీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన నీటి శుద్ధి యంత్రం (ఆర్‌వో) ఆసుపత్రి సిబ్బంది దాహార్తిని తీర్చడం లేదు. ఆర్‌వో సిస్టంకు నీరందించేందుకు ట్యాంకు లేకపోవడంతో ఇది ఏడాదికి పైగా నిరుపయోగంగా మిగిలింది. మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య రూ.లక్ష వెచ్చించి నార్కట్‌పల్లి పీహెచ్‌సీలో సిబ్బందికి సురక్షిత నీటిని అందిస్తూ దాహార్తిని తీర్చేందుకు ఉపయోగపడే ఆర్‌వో సిస్టంను ఏర్పాటు చేయించారు. ఈ నీటి శుద్ధి యంత్రంలోకి బోరు మోటారు ద్వారా నీటిని పంపింగ్ చేసేందుకు పైప్‌లైన్‌తో పాటు నీటిని నిల్వ చేసుకుని ఆర్‌వోకు నీటిని అందించే ట్యాంకు లేకపోవడంతో ఏడాదిగా ఆర్‌వో యంత్రం నిరుపయోగంగా మిగిలింది. ఆర్‌వో సిస్టంను వాడకంలోకి తీసుకురావాలంటే కనీసం రూ.30వేల వరకు ఖర్చవుతుందని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ అరుంధతి తెలిపారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీలో నిధులు లేవని చెప్పారు.



విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

వలిగొండ, మే 5:: విద్యుదాఘాతంతో వ్యక్తి మృతిచెందాడు. ఎస్‌ఐ మహేందర్, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రిభువనగిరి జిల్లా మండలంలోని దుప్పల్లి గ్రామానికి చెందిన గాదెగోని రోషయ్య (48) హైదరాబాద్‌లో ఒక ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. స్వగ్రామంలో తాను నూతనంగా నిర్మిస్తున్న ఇంటి పిల్లర్లకు కావలసిన నీరు కొట్టడానికి విద్యుత్ మోటార్ పైపును సరి చేసే క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. భార్య లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామన్నపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు.

చెరువులో పడి రైతు మృతి

సూర్యాపేటరూరల్, మే 5: ప్రమాదవశాత్తు చెరువులో పడి రైతు మృతి చెందాడు. ఈ సంఘటన మునిసిపల్ పరిధిలోని పిల్లలమర్రి గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన రైతు దాసరి మల్లయ్య (60) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఆతని పాడిగేదెలను మేపాడానికి గ్రామ శివారులోని చెరువు సమీపంలోకి తీసుకవెళ్లాడు. అయితే గెదెలను సాయంత్రం ఇంటికి తోలే క్రమంలో చెరువులోకి దిగి గెదెలను బయటికి తరలించే క్రమంలో ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందాడు. మల్లయ్యకు భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.







యాదగిరిగుట్టలో భక్తుల రద్దీ

● కిక్కిరిసిన ఉభయ క్యూలైన్లు ● తిరుమాడ వీధుల్లో భక్తుల సందడి ● ధర్మదర్శనాలకు నాలుగు గంటలు


క్యూలైన్లలో ఉన్న భక్తులు


షెడ్డు కింద సేదతీరుతున్న భక్తులు

భువనగిరి అర్బన్, మే 5: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి క్షేత్రం ఆదివారం భక్త జనులతో కిటకిటలాడింది. వారాంతపు సెలవు రోజు కావడంతో ఇష్టదైవాలను దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో వాహనాలో తరలివచ్చారు. 43వేల మంది భక్తులు క్షేత్ర దర్శనానికి రాగా ప్రత్యేక, ధర్మదర్శన క్యూలైన్లలో ఉదయం నుంచి రాత్రి వరకు భక్తుల రద్దీ కొనసాగింది. వీఐపీ టికెట్ దర్శనానికి రెండు గంటలు, ధర్మదర్శనానికి నాలుగు గంటల సమయం పట్టిందని భక్తులు తెలిపారు. నీడ లేని ప్రదేశాల్లో కొంతమంది భక్తులు వేసవి తాపానికి తట్టుకోలేక కొండ బండపై పరుగులు తీశారు. ఆలయ ఉత్తర దిశలో ఏర్పాటు చేసిన షెడ్డు కింద భక్తులు అధికసంఖ్యలో సేద తీరారు. కొండపైకి భక్తులను తరలించేందుకు ఆర్టీసీ తగిన ఏర్పాట్లు చేయగా బస్సులు ప్రయాణికులతో కిక్కిరిసి పోవడంతో సీట్ల కోసం పోటీ పడ్డారు. బస్టాండ్ ఆవరణలో కార్లు పార్క్ చేయడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. భక్తులకు తగినట్లు మంచినీరు సరఫరా అందక దాహం తీర్చుకునేందుకు కుళాయిల వద్ద భక్తుల రద్దీ నెలకొంది. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ.53,32,909 ఆదాయం సమకూరిందని ఆలయ ఈవో ఏ. భాస్కర్‌రావు తెలిపారు.

శాస్త్రోక్తంగా నిత్య పూజలు

సుప్రభాత సేవతో స్వామి అమ్మవారలను మేల్కొపిన అర్చకస్వాములు స్వయంభువులకు నిత్యపూజలు సంప్రదాయరీతిలో నిర్వహించారు. గర్భాలయంలో స్వయంభువులకు అభిషేకం, అర్చనలు, ప్రాతకార మండపంలో హోమం, నిత్య కల్యాణోత్సవ పర్వాలు వైభవంగా చేపట్టారు. పాతగుట్ట స్వామి అమ్మవారలకు నిత్య పూజలు ఘనంగా చేపట్టారు. అదేవిధంగా శివాలయంలో పర్వతవర్థిని సమేత రామలింగేశ్వర స్వామికి నిత్య పూజలు, రుద్రహవన పూజలు, శైవాగమరీతిలో జరిపారు. రాత్రి మహానివేదన, శయనోత్సవాలతో ఆలయ ద్వారబంధనం చేశారు. ఆదిలాబాద్‌కు చెందిన లోక్‌సభ ఎన్నికల పరిశీలకుడు రాజేంద్రవిజయ్, తెలంగాణ ఇండస్ట్రియల్, ఇన్‌ఫ్రాస్ట్రక్షర్ కార్పొరేషన్ వైస్ చైర్మన్, ఎం.డీ విష్ణువర్ధన్‌రెడ్డి కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు. వీరికి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వారికి వేద పండితులు వేద ఆశీర్వచనం చేయగా ఈవో ఏ. భాస్కర్‌రావు లడ్డు ప్రసాదాలు అందజేశారు.

ప్రశాంతంగా ‘నీట్’

● 2,262 మంది విద్యార్థులు హాజరు ● 56మంది గైర్హాజరు

నల్లగొండ, మే 5: వైద్యవిద్య కోర్సులో ప్రవేశానికి నిర్దేశించిన నీట్ - 2024 (నేషనల్ ఎలిజిబిలిటీ కం ఎంట్రన్స్ టెస్ట్) పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. మొత్తం ఏడు పరీక్షా కేంద్రాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు నిర్వహించారు. మొత్తం 2,318 మంది విద్యార్థులకు గాను 2,262 మంది పరీక్షకు హాజరుకాగా 56 మంది గైర్హాజరయ్యారు. పరీక్షా కేంద్రాల్లోకి ఉదయం 11నుంచి మధ్యాహ్నం 1.30 గంట వరకు అనుమతించారు. పరీక్షల్లో ఎలాంటి అవకతవకలు జరగకుండా ఏర్పాట్లు చేశారు. అదేవిధంగా విద్యార్థులు ఎలాంటి ఎలక్ట్రానిక్స్ వస్తువులు తీసుకురాకుండా ముందుగానే క్షుణ్ణంగా పరిశీలించి పరీక్షా కేంద్రంలోకి అనుమతించారు. నీట్ ప్రవేశపరీక్ష ప్రశాంతంగా, సజావుగా సాగినట్లు నీట్ - 2024 కో ఆర్డినేటర్ జి.పార్థసారధి తెలిపారు.


పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థినీవిద్యార్థులు

పోరాడే వారిని పార్లమెంట్‌కు పంపాలి


కట్టంగూరులో మాట్లాడుతున్న బీవీ రాఘవులు


సంస్థాన్‌నారాయణపురంలో మాట్లాడుతున్న సీతారాములు

కట్టంగూరు, మే 5: ప్రజల తరపున పోరాడే వారిని పార్లమెంటుకు పంపిస్తే ప్రజా సమస్యలకు పరిష్కారం లభిస్తుందని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు అన్నారు. నల్లగొండ జిల్లా కట్టంగూరు మండలంలోని చెరువు అన్నారం గ్రామంలో ఆదివారం రాత్రి జరిగిన భువనగిరి పార్లమెంట్ సీపీఎం అభ్యర్థి ప్రచార సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. పదేళ్లుగా కేంద్రంలో దుర్మార్గపు పాలన కొనసాగుతుందని బీజేపీ పాలనకు చరమగీతం పాడి ప్రజాస్వామ్య శక్తులను గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. రైతులు కనీస మద్దతు ధర కోసం ఏడాది పాటు ఉద్యమం చేస్తే వారిపై లాఠీలతో ఉద్యమాన్ని అణచివేసిందన్నారు. రైతుల పక్షాన ఎన్నో ఉద్యమాలను సీపీఎం నిర్వహించిందని, యూపీఏ హయాంలో సీపీఎం వల్లే ఉపాధి హామీ పథకం అమలైందని అన్నారు. దాని వల్ల పేదలకు ప్రయోజనాలు చేకూరుతున్నాయని అన్నారు. సీపీఎం ఎంపీ అభ్యర్థి ఎండీ జహంగీర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. అంతకు ముందు గ్రామంలోకి ప్రచార రథం రాగానే గ్రామస్థులు అధిక సంఖ్యలో కోలాటాలు, డప్పుచప్పుళ్లతో ఘనంగా స్వాగతం పలికారు. సమావేశంలో సీపీఎం ఎంపీ అభ్యర్థి ఎండీ జహంగీర్, సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు తుమ్మల వీరారెడ్డి, లెల్లల బాలకృష్ణ, కందాల ప్రమీల, చినపాక లక్ష్మీనారాయణ, గంజి మురళి, దండెంపల్లి సత్తయ్య, బొజ్జ చిన్న వెంకులు, పెంజర్ల సైదులు, మాజీ జడ్పీటీసీ చిలుముల హేమంతయ్య, రాచకొండ వెంకన్న, లూరుదు మారయ్య, చిలుమల రామస్వామి, గడగోజు రవీంద్రచారి, పీఎన్‌ఎం రాష్ట్ర నాయకులు కుమ్మరి శంకర్, మురారి మోహన్, చిలుముల కృష్ణయ్య, గంట వెంకన్న, పొన్న అంజయ్య, గద్ద పాటి సుధాకర్, రెడ్డిమల్ల బిక్షం తదితరులు పాల్గొన్నారు.

సీపీఎందీ త్యాగాల చరిత్ర: చెరుపల్లి

సంస్థాన్‌నారాయణపురం: పీడిత ప్రజల సమస్యల పరిష్కారం కోసం అనునిత్యం పోరాటం చేస్తూ, పాలకవర్గాల చేతిలో ప్రాణాలు కోల్పోయిన త్యాగాల చరిత్ర కలిగినది సీపీఎం అని, ఎన్నికల్లో ఆదరించాలని పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు కోరారు. యాదాద్రిభువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో ఆదివారం సిపిఎం విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈసందర్భంగా సీతారాములు మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడే అభ్యర్థికి ప్రజలు ఓట్లు వేయాలని ఆయన కోరారు. బీజేపీ, బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలకు ప్రజల తరుపున పోరాడిన చరిత్ర ఉందా? అని ఆయన ప్రశ్నించారు. భువనగిరి నియోజకవర్గంలో ఉన్న అనేక సమస్యలపై పోరాడిన చరిత్ర సీపీఎం అభ్యర్థికి ఉందని ఆయన తెలిపారు.తమ ఆస్తులను కాపాడుకునేందుకు కాంగ్రెస్, బీజేపీ ,బిఆర్‌ఎస్ అభ్యర్థులు పోటీ చేస్తున్నారని, ప్రజల సమస్యల పరిష్కారం కోసం పోరాడేందుకు సిపిఎం అభ్యర్థి పోటీ చేస్తున్నారని సీతారాములు వివరించారు.ఈ సమావేశంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు టి.స్కైలాబ్ బాబు, నాయకులు దోనూరు నర్సిరెడ్డి, తుమ్మల నర్సిరెడ్డి, గుంటోజు శ్రీనివాసాచారి,దోడ యాదిరెడ్డి, సురుకంటి శ్రీనివాస్‌రెడ్డి,మల్లేపల్లి లలిత, చింతకాయల నరసింహ, పిట్ట రాములు, జనిగల నరసింహ్మ, ఉప్పలపల్లి బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం సీనియర్ నాయకుడు అంజిరెడ్డి మృతి

● మెడికల్ కళాశాలకు భౌతికకాయం అప్పగింత

తిప్పర్తి, మే 5: నల్లగొండ జిల్లా తిప్పర్తి మండల పరిధిలోని అంతయ్యగూడెం గ్రామానికి చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు నన్నూరి అంజిరెడ్డి(84) శనివారం రాత్రి గుండెపోటుతో మృతిచెందారు. ఆయన కుమారుడు, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి నన్నూరి రమణారెడ్డి తనతండ్రి పార్థివదేహాన్ని ఆదివారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని మెడికల్ కళాశాలకు అప్పగించారు. అంతకు ముందు అంజిరెడ్డి మృతదేహానికి సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి, ఎమ్మెల్సీ అల్లుబెల్లి నర్సిరెడ్డి, నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, తిప్పర్తి జడ్పీటీసీ పాశం రాంరెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, నాయకులు మన్నెం భిక్షం, బీమగాని గణేష్, జంజరాల సైదులు తదితరులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ అంజిరెడ్డి జీవితాన్ని పూర్తిగా ప్రజల కోసమే అంకితం చేశారని కొనియాడారు. పార్టీ నిర్మాణంలో కీలక పాత్ర పోషించారన్నారు. రైతు సంఘం డివిజన్ కార్యదర్శిగా పని చేశారన్నారు.


భౌతికకాయాన్ని మెడికల్ కళాశాలకు అప్పగిస్తున్న నాయకులు



నిరుపేదల కోసం భూ పోరాటాలు చేశారని గుర్తు చేశారు. కుమారుడు, నన్నూరి వెంకట్‌రమణారెడ్డి, కుమార్తె సువర్ణ కూడా విప్లవ భావాలు ఉన్నవారని, వారు నేటికీ ప్రజా సేవలో ముందుంటున్నారన్నారు. రమణారెడ్డి తన తండ్రి మృతదేహాన్ని మెడికల్ కళాశాలకు అప్పగించి ఆదర్శంగా నిలిచారని అన్నారు.

కాంగ్రెస్‌లో పనిచేసేవారికి భవిష్యత్తు

● మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

మునుగోడు, సంస్థాన్‌నారాయణపురం, మే 5: కాంగ్రెస్ పార్టీలో నీతి, నిజాయితీ, క్రమ శిక్షణతో పనిచేసే వారికి భవిష్యత్తులో సముచిత స్థానం ఉంటుందని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జక్కలి ఐలయ్యయాదవ్ ఆదివారం ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో తన అనుచరులతో కలిసి పీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బండ్రు శోభారాణి ఆధ్వర్యంలో ఐలయ్య కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణలో తమ పార్టీ అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులపై కాంగ్రెస్‌లో చేరుతున్నారని అన్నారు. ఈ సందర్భంగా ఐలయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కోసం తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి సారథ్యంలో జరుగుతున్న అభివృద్ధిలో భాగస్వాములు అయ్యేందుకే తాను కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు తెలిపారు. పార్టీలో చేరిన వారిలో టీడీపీ భువనగిరి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి మక్కెన అప్పారావు, చండూరు మండల అధ్యక్షుడు ఎర్రజెల్ల లింగయ్య, నాయకులు నెట్టు శ్రీకాంత్, పొడపంగి సైదులు, ముద్దం శ్రీనివాస్‌గౌడ్, పగడాల లింగయ్య, మారగోని పాపయ్య, పగిళ్ల రవీందర్ తదితరులు ఉన్నారు.


ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న అయిలయ్య

ఈదురుగాలులు.. వర్ష బీభత్సం

● కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం ● పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ● గాలికి లేచిన ఇళ్లపై కప్పులు



నల్లగొండ పట్టణంలో కురుస్తున్న వర్షం



నాగారంలో రోడ్డుపై పడిన చెట్లను తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్



చౌటుప్పల్‌లో నేలరాలిన మామిడికాయలు

నల్లగొండ, శాలిగౌరారం: మే 5: ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఓ వైపు ఎండలు మండుతుండగా ఆదివారం సాయంత్రం నుంచి రాత్రి ఈదురు గాలులు, ఉరుములతో భారీ వర్షం కురిసింది. నల్లగొండ జిల్లాకేంద్రంలో సాయంత్రం 6గంటల నుంచి వర్షం మొదలైంది. ఉరుములు, మెరుపులతో మోస్తారు నుంచి భారీ వర్షం కురిసింది. శాలిగౌరారం మండలంలో ఈదురుగాలులతో అక్కడక్కడ విద్యుత్ స్తంభాలు, చెట్లు నెలకొరిగాయి.

సంస్థాన్ నారాయణపురం: యాదాద్రిభువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలంలో ఆదివారం సాయంత్రం ఈదురు గాలులతో వర్షం కురిసింది. మండలకేంద్రానికి చెందిన దేశిడి నరేందర్‌రెడ్డి మామిడి తోట దెబ్బతిని మామిడి కాయలు రాలిపోయాయి. నారాయణపురం శివారులోని ఉప్పల కృష్ణకు చెందిన కోళ్ళ షెడ్డు గాలికి కుప్పకూలింది. రెండు షెడ్లు ఉండగా, ఒక షెడ్ పూర్తిగా నేలమట్టమైంది. మరోషెడ్డు పాక్షికంగా దెబ్బతిన్నది. వెంకంబాయితండాలో ఈదురుగాలులకు విద్యుత్ స్తంభం కూలిపోయింది. మండలంలోని పలు గ్రామాలలో చెట్లు విరిగిపడ్డాయి.

తిరుమలగిరి రూరల్: మండలంలోని తొండ, వెలిశాల గ్రామాల్లో ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన, తేలికపాటి వర్షం కురిసింది. దీంతో అక్కడక్కడ చెట్లు కూలి, రేకుల ఇండ్ల పైకప్పులు లేచి ప్రజలు నిరాశ్రయులయ్యారు. వెలిశాల గ్రామంలో తాటిచెట్టుపై పిడుగుపడింది. ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు.

పిడుగుపాటుతో వ్యవసాయ కూలీ మృతి

అడ్డగూడూరు: యాదాద్రిభువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలం కోటమర్తి గ్రామంలో పిడుగుపాటుతో వ్యక్తిమృతి చెందాడు. గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ చిప్పలపల్లి బాలమల్లు(65) తన పాడి గేదెను మేత కోసం వ్యవసాయ బావి వద్దకు తోలుకెళ్లాడు. ఆదివారం సాయంత్రం ఈదురు, గాలులు ఉరుములతో కూడిన వర్షం కురిసింది. ఆ సమయంలో ఊరికి దగ్గరలో ఉన్న పశువుల కొట్టంలోకి వెళ్లాడు. కొట్టం సమీపంలో పిడుగు పడడంతో బాలమల్లు మృతిచెందగా పాడి గేదె మృత్యువాత పడింది. బాలమల్లుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

వలిగొండ: మండలంలో పలు గ్రామాల్లో ఆదివారం సాయంత్రం అకాల వర్షం కురిసింది. నాగారంలో వడగండ్ల వాన కురిసింది. వడగండ్లకు సుమారుగా 100 ఎకరాల వరి పంట నష్టం కలిగిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఆరబెట్టిన ధాన్యంపై వీచిన గాలులకు పట్టాలు లేచిపోయి కొంతమేరకు ధాన్యం తడిసింది. వెంకటాపురం గ్రామంలో జక్కుల కృష్ణ అనే రైతుకు చెందిన పాడి ఆవు పిడుగుపాటుకు మృతిచెందింది.

రామన్నపేట: మండలంలోని పలు గ్రామాల్లో ఉరుములు, మెరుపులతో పెనుగాలులతో ఆదివారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. రామన్నపేట, నిర్మల, దుబ్బాక గ్రామాల్లో విద్యుత్ తీగలు తెగి, చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.



ఆత్మకూర్(ఎస్): పాతర్లపహాడ్‌లో రోడ్డుపై కూలిన చెట్టు

గుండాల: మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం రాసులు తడిసిపోయాయి. మండలంలోని సీతారాంపురం, మర్రిపడగ గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు విరిగాయి. మామిడిపండ్లు రాలిపోయాయి. తుర్కల శాపురం గ్రామంలో జక్కుల యాదయ్య వ్యవసాయ బావి వద్ద పిడుగుపడి పాడిగేదె మృతి చెందింది. దీంతో రూ. 80వేల నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపారు. వివిధ గ్రామాల్లో విద్యుత్ తీగలు తెగిపోవడంతో విద్యుత్ లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

మోతె: ఈదురుగాలులకు మామిడి కాయలు నేల రాలాయి. అన్నారిగూడెం, నామవరం, సిరికొండ గ్రామాల్లో మామిడి తోటల్లో కాయలు రాలడంతో పాటు చెట్లు కూలిపోయాయి. నామవరం నుంచి గుంజలూరు రోడ్డుకు వెళ్లే దారిలో చెట్లు కూలి రోడ్డుకు అడ్డంగా పడిపోయాయి. సిరికొండ నుంచి రావిపహడ్ వెళ్లే రోడ్డుకు అడ్డంగా చెట్లు కూలడంతో పాటు కంప చెట్లు రోడ్డుకు పడిపోయాయి. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

చండూరు రూరల్: మండలంలోని ఉడుతలపల్లి గ్రామంలో ఆవు మృతిచెందింది. గ్రామానికి చెందిన నిరుపేద రైతు బుషిపాక హుస్సేన్ గ్రామంలో వ్యవసాయం చేస్తూ ఆవుపాలు అమ్ముకుని జీవనం సాగిస్తున్నారు. ఆదివారం కూడా తన వ్యవసాయం పొలం వద్ద ఆవులను మేపి సాయంత్రం బయలుదేరాడు. వర్షం వస్తుండటంతో ఒక ఆవును పొలం వద్ద ఉన్న తాటిచెట్టుకు, మరో ఎద్దును వేరొక చెట్టుకు కట్టేసి దూడను సమీపంలో ఉన్న కొట్టంలోకి తీసుకువెళ్ళాడు. ఇంతలో ఉరుములతో కూడిన పిడుగు పడటంతో వెంటనే అక్కడ కట్టేసి ఉన్న ఆవు మృతిచెందింది. గ్రామానికి చెందిన కావలి బక్కమ్మ ఇంటి పైకప్పు రేకులు గాలికి ఎగిరిపడ్డాయి. అక్కడక్కడ ఈదురు గాలులకు తీగలు తెగిపోవడంతో కరెంటు సరఫరా నిలిచిపోయింది.

● కస్తాల గ్రామంలో మేకల సత్తిరెడ్డి అనే రైతు వ్యవసాయ బావి వద్ద తాటిచెట్టుపై పిడుగు పడటంతో తాటిచెట్లు కాలిపోతున్నాయి. ఎటువంటి ప్రాణ నష్టం కలగలేదు. అకాలంగా కురిసిన వర్షానికి ఈదురు గాలులకు చెట్లు విరిగి కట్ట బక్కయ్య ఇంటిపై పడ్డాయి. అలాగే ఈదురు గాలులకు విద్యుత్ తీగలు తెగిపడటంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

మర్రిగూడ: భారీ వర్షానికి రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లు కూలడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. తిరుగండ్లపల్లి, రాజుపేట తండా గ్రామంలో ఈదురు గాలుల వల్ల పరమేష్ ఇంటి సమీపంలో ఉన్న వేప చెట్టు కూలి కారుపై పడడంతో కారు పూర్తిగా ధ్వంసమైంది. అదే గ్రామానికి చెందిన వెంకటయ్య ఇంటిపైన రేకులు లేచిపోయాయి. రాజుపేట తండాలోని రవి నాయక్ ఇంటి వద్ద చెట్టు కూలిపోవడంతో ఇల్లు కూడా ధ్వంసమైంది. అర్ధగంట సేపు ఈదురుగాలులు రావడంతో విద్యుత్ స్తంభాలు కూలి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

పెద్దఅడిశర్లపల్లి: మండల వ్యాప్తంగా మోతాదు వర్షం కురిసింది. కొనుగోలు కేంద్రాల్లో రైతులు పోసిన ధాన్యం కుప్పలపై గాలిదూమారానికి పట్టాలు లేచిపోయాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. ఒక్కసారిగా వాతావరణం చల్లబడడంతో ప్రజలు ఉపశమనం పొందారు.

కేతేపల్లి: మండలంలోని వివిధ గ్రామాల్లో ఆదివారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు వర్షం కురిసింది. ఈదురు గాలులకు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఆదివారం సాయంత్రం ఆకాశం మేఘావృతమై కురిసిన చిరుజల్లులతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. దీంతో తీవ్రమైన వేసవి ఎండలతో నెల రోజులుగా అల్లాడిన మండల ప్రజలు కాస్త ఉపశమనం పొందారు.

ఆత్మకూర్(ఎస్): మండలంలోని సూర్యాపేట దంతాలపల్లి రోడ్డుపై పాతర్లపహాడ్ స్టేజీ నుంచి సూమారుగా మూడు కిలోమీటర్ల మేర రోడ్డు పక్కన ఉన్న భారీ చెట్లు గాలి తాకిడికి కూలిపోయి రోడ్డుకు అడ్డంగా పడిపోయాయి. దీంతో గంటకు పైగా వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. నూతన్‌కల్ మండలం నుంచి రోగిని తీసుకెళ్తున్న అంబులెన్స్ కూడా ట్రాఫిక్‌లో చిక్కిపోయింది. పాతర్లపహాడ్ గ్రామానికి చెందిన సోములు అనే వ్యక్తి ఇంటిపై విద్యుత్ స్తంభం పడిపోవడంతో ఇల్లు స్వల్పంగా దెబ్బతిన్నది. ఏపూర్ లో సానబోయిన సోమయ్య తన గేదెను ఇంటి ముందు చెట్టుకు కట్టేసి ఉండగా చెట్టు కూలి గేదే పై పడిపోవడంతో గేదె మృతిచెందింది. పీపానాయక్ తండాలో గూగులోత్ బుజ్జమ్మకు చెందిన రేకుల ఇల్లు గాలికి లేచిపోయింది. బోరింగ్ తండాలో రేషన్ షాపుపై కప్పు రేకులు లేచిపోవడంతో బియ్యం బస్తాలు తడిసిపోయాయి. గట్టికల్ గ్రామంలో సాలమ్మ ఇంటి ముందు వేప చెట్టు విద్యుత్ తీగలపై కూలిపోవడంతో తీగలు రోడ్డుపై తెగిపడ్డాయి. పాతర్లపహాడ్ స్టేజీ వద్ద రావుల సతీష్, భద్రయ్య, లక్ష్మయ్య, మధుకర్, సురేష్‌ల రేకుల ఇండ్ల పై కప్పులు లేచిపోయాయి. పాత సూర్యాపేట లో విద్యుత్ మెయిన్ లైన్ స్తంభం గూడూరు వెంకట్‌రెడ్డి ఇంటిపై పడింది. ఇల్లు ధ్వంసం అయ్యింది. గొర్రెలకు తీవ్ర గాయాలు అయ్యాయి. వళ్లపు శంకర్, కొప్పు హరీష్, రేకులు గాలికి లేచిపోయాయి. రామన్నగూడెం గ్రామానికి రైతు గోలుసుల రాములు కు చెందిన ఎద్దు పిడుగుపాటుకు గురై చనిపోయింది. ఎద్దు విలువ రూ. లక్ష వరకు ఉంటుందని రైతు తెలిపాడు.

నాగారం: ఈదురు గాలుల బీభత్సంతో నాగారం మండలంలో పలు గ్రామాల్లో ఇళ్ల పైకప్పులు లేచిపోయాయి, విద్యుత్ లైన్‌లు తెగిపోయాయి, స్తంభాలు విరిగిపోయాయి. ఈదురుగాలులతో ఈటూరులో మామిడి తోటలో కాయాలు రాలాయి. నాగారంలో తాటి చెట్టుపై పిడుగు పడింది. నాగారం తుంగతుర్తి రహదారిపై చేట్లు విరిగి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. శాంతినగర్ గ్రామంలో టాన్సపార్మర్ కూలిపోయి విద్యుత్ అంతరాయం కలిగింది. నాగారం బంగ్లా గ్రామపంచాయతీ పరిధిలోని వసుధ రైస్‌మిల్లు పైకప్పు లేచిపోవడంతో మిల్లులో ధాన్యం తడిసిపోయాయి. మండలంలో ఆదివారం ఆకస్మాత్తుగా వీచిన గాలి వానతో భారీగా ఆస్తి నష్టం జరిగింది.



మర్రిగూడ: చెట్టు పడడంతో ధ్వంసమైన కారు

కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం



మర్రిగూడలోని కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యం

మోత్కూరు: యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు మండల కేంద్రంతో పాటు కొండగడప, బుజిలాపురం, పాటిమట్ల తదితర గ్రామాల్లో ఈదురు గాలులతో కూడిన వడగండ్ల వర్షం భీభత్సం సృష్టించింది. ఉరుములు, మెరుపులతో విపరీతమైన గాలులు వీచడంతో చెట్లు విరిగాయి. పలు చోట్ల ఇళ్ల పైకప్పులు లేచిపోయాయి. విద్యుత్ స్తంభాలు విరిగి, తీగలు తెగి మండలంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. బుజిలాపురంలో ఎండబోసినట్టు వడగళ్లు కురిశాయి. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రాశులు, తూకం వేసిన బస్తాలు టార్పాలిన్లతో కప్పిపెట్టినప్పటికీ గాలికి టార్పాలిన్లు లేచిపోయి బస్తాలు, ధాన్యం రాశులు తడిచాయి. మామిడి, నిమ్మ తోటల్లో ఉన్న కాయలు రాలిపోయాయి. బుజిలాపురంలోని తమ తోటల్లో మామిడి కాయలు రాలిపోయాయని మామిడి రైతులు చింతల విజయభాస్కర్‌రెడ్డి, మదూరు యాదిరెడ్డి తెలిపారు. గుడిసెలు గాలికి లేచిపోయాయి. మోత్కూరులో కంచర్ల మోహన్‌రెడ్డి ఇంటిపై కప్పులేచిపోయింది. కొండాపురంలో నీల నర్సయ్య, సారగండ్ల జగన్నాధం, మన్నె బుచ్చిరాములు, నీల సోమయ్య, బీసు రమేష్ తోపాటు మరికొంత మంది ఇంటి ముందు వేసుకున్న పాకలు, వంట గది రేకులు లేచిపోయాయి. కొండగడపలో ఇంటి రేకులు లేచిపోయాయి. ముశిపట్ల, దత్తప్పగూడెం, అనాజిపురం, పాలడుగు గ్రామాల్లో ఈదురు గాలులు వీచాయి. చెట్లు విరిగి పడ్డాయి. రోడ్డుకు అడ్డంగా పడిన చెట్లను ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు. ముశిపట్లలో విద్యుత్ స్తంభం విరిగిపడింది. ఆదివారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షం పడటం వల్ల మర్రిగూడ, ఎరుగండ్లపల్లి గ్రామంలో ఐకేపీ ద్వారా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యం వర్షానికి తడిసి ముద్దయింది. అదేవిధంగా సంచులలో నింపిన ధాన్యం కూడా తడిసి ముద్దయ్యాయి.



మోత్కూరు: కొండగడపలో ఈదురు గాలులకు లేచిపోయిన ఇంటి పైకప్పు

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు వేసిన బస్తాలు తడిసిపోయాయి, ఎలాంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

ఉదయం ఉక్కిరిబిక్కిరి.. సాయంత్రం ఉపశమనం

నల్లగొండ: ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఆదివారం ఉదయం ఎండలు ఉక్కిరిబిక్కిరి చేయగా, సాయంత్రానికి ఈదురు గాలులు వర్షానికి ప్రజలు ఉపశమనం పొందారు. ఉదయం ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో జనం బయటికి వెళ్లలేదు. సాయంత్రం వాతావరణంలో ఒక్కసారిగా మారింది. పలుచోట్ల మబ్బులు కమ్ముకున్నాయి. ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. ఇన్నాళ్లూ అధిక ఉష్ణోగ్రతలతో ఇబ్బంది పడిన జనం కాస్త ఉపశమనం పొందారు. నల్లగొండ జిల్లా కేంద్రంలో సాయంత్రం 6గంటల నుంచి వర్షం మొదలైంది. ఉరుములు, మెరుపులతో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. నల్లగొండ మండలం గుండ్లపల్లిలో 5.0 మి.మీలు, మర్రిగూడ 3.5మి.మీలు, చిట్యాల మండలంలో 2.8మి.మీలు, గట్టుప్పల్‌లో 2.3మి.మీలు, నార్కట్‌పల్లి 1.3మి.మీలు, చండూరులో 0.8మి.మీలు, చింతపల్లిలో 0.5మి.మీల చొప్పున వర్షం కురిసింది. వర్షంతో పాటు ఈదురుగాలులకు జిల్లాలో చాలాచోట్ల విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. మోత్కూరులో ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. వలిగొండ మండలంలోనూ వర్షపు జల్లులు కురిశాయి. నల్లగొండ జిల్లా నాంపల్లిలో గరిష్ఠంగా 46.1, కనిష్ఠంగా 40.2, సూర్యాపేట జిల్లా నూతనకల్‌లో గరిష్ఠంగా 44.9, పాలకవీడు మండలం అలంగాపురంలో కనిష్ఠంగా 41.8, యాదాద్రిభువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలంలో గరిష్ఠంగా 45.2డిగ్రీలు, గుండాలలో కనిష్ఠంగా 41.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.



నల్లగొండ క్లాక్‌టవర్ సెంటర్‌లో తడుచుకుంటూ వెళుతున్న మహిళలు

వసూళ్లకు పాల్పడిన కానిస్టేబుల్ సస్పెన్షన్

నల్లగొండ, కేతేపల్లి, మే 5: విధి నిర్వహణలో వసూళ్లకు పాల్పడిన నల్లగొండ జిల్లా కేతేపల్లి పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ పి. మహేష్‌ను సస్పెండ్ చేస్తూ నల్లగొండ జిల్లా ఎస్పీ చందనా దీప్తి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. గత నెల 28వ తేదీన కొర్లపహాడ్ టోల్‌గేట్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న సమయంలో విజయవాడలో ఒక శుభకార్యానికి వెళ్లి తిరిగి హైదరాబాద్ వెళ్తున్న క్రమంలో వాహనం తనిఖీ చేయగా అందులో తొమ్మిది బీర్లు ఉన్నాయని తెలిపారు. దీంతో వారిపై కేసు నమోదు చేస్తామని బెదిరించి వారి వద్ద నుంచి రూ.6వేలు డిమాండ్ చేసి పక్కనే ఉన్న పెట్రోల్ బంకు ద్వారా ఫోన్‌పే చేయించుకున్నాడని తెలిపారు. బాధితులు ఫిర్యాదు చేయగా విచారణ అనంతరం నిర్ధారణ చేసుకుని సదరు కానిస్టేబుల్ సస్పెండ్ చేసినట్లు పేర్కొన్నారు. విధి నిర్వహణలో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నిప్పంటుకుని గడ్డి, పైపులు దగ్ధం

ఆత్మకూరు(ఎం) మే 5: యాదాద్రిభువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలం పల్లెపహడ్ గ్రామంలో నిప్పంటుకొని ఆదివారం పొలంలో ఉన్న గడ్డి, పైపులు కాలిపోయాయి. బీసు రాములు రైతు తనకున్న ఆరు ఎకరాల పొలంలో వరి పొలం కోశాడు. గడ్డి అలాగే ఉంచాడు. గుర్తుతెలియని వ్యక్తులు ఆదివారం తన పొలంలో గడ్డికి నిప్పుపెట్టారని, దీంతో పొలంలోఉన్న గడ్డితో పాటు పైపులు కాలిపోయాయని, ప్రమాదంలో రూ.50 వేల నష్టం వాటినట్లు రైతు తెలిపాడు.

రేషన్‌షాపులో ఐదు క్వింటాళ్ల బియ్యం చోరీ

దేవరకొండ, మే 5: నల్లగొండ జిల్లా దేవరకొండ మండలం మైనంపల్లి గ్రామంలోని రేషన్ దుకాణంలో గుర్తుతెలియని వ్యక్తులు శనివారం రాత్రి తాళం పగలగొట్టి ఐదు క్వింటాళ్ల బియ్యం ఎత్తుకెళ్లారు. దేవరకొండ సీఐ నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం.. మైనంపల్లిలో రేషన్ దుకాణంలో నిల్వ ఉన్న ఐదు క్వింటాళ్ల బియ్యాన్ని అపహరించారని రేషన్ డీలర్ శీలం జయలక్ష్మి ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. డీలర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

జీవితంపై విరక్తితో బలవన్మరణం

బీబీనగర్, మే 5: కుమారుడి మృతి, మరో వైపు ఆర్థిక ఇబ్బందులతో మానసిక క్షోభకు గురైన వ్యక్తి జీవితంపై విరక్తి చెంది ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం గూడూరులో ఆదివారం జరిగింది. ఎస్ఐ అమర్‌సింగ్ తెలిపిన వివరాల ప్రకారం.. గూడూరు గ్రామానికి చెందిన జుర్రు రాము, లావణ్య దంపతులకు ఇద్దరు కుమారులు, పాల వ్యాపారంతో పాటు టోల్‌ప్లాజా వద్ద ఓ దాబాను అద్దెకిచ్చి జీవనోపాధి పొందుతున్నాడు. మూడు నెలల క్రితం పెద్ద కుమారుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పటి నుంచి తండ్రి రాము కుమారుడు లేడన్న మనోవేదనకు గురవుతున్నాడు. మరో పక్క ఆర్థిక ఇబ్బందులతో మానసిక క్షోభ అనుభవిస్తున్నాడు. దీంతో జీవితంపై విరక్తిచెంది గూడూరు టోల్‌ప్లాజా వద్ద తన పశువుల దొడ్డిలో తెల్లవారు జామున ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పశువుల దొడ్డిలో తాడుకు వేలాడుతు కనిపించిన రాము మృత దేహాన్ని చూసిన గ్రామస్థులు కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. పోలీసులకు కూడా సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ అమర్‌సింగ్ సంఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. ఆత్మహత్యకు గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. రాము భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రూ.10వేల విలువైన మద్యం పట్టివేత

మర్రిగూడ, మే 5: అనుమతి లేకుండా మద్యం విక్రయిస్తున్న ఇంటిపై పోలీసులు ఆదివారం దాడిచేసి మద్యం స్వాధీనం చేసుకున్నారు. మర్రిగూడ ఎస్ఐ రంగారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. లెంకలపల్లి గ్రామానికి చెందిన దాసరి నర్సింహ తన ఇంట్లో మద్యం సీసాలు ఉండటంతో సమాచారం తెలుసుకున్న ఎస్ఐ దాడులు చేసి రూ. 10వేల విలువైన మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

డిగ్రీ ప్రవేశాలకు దోస్త్

» నేటినుంచి ఆన్‌లైన్‌లో ప్రక్రియ ప్రారంభం » మూడు దశల్లో మే 6 నుంచి జూలై 3 వరకు » జూలై 7 నుంచి తరగతులు ప్రారంభం » ఉమ్మడి జిల్లాలో 75 డిగ్రీ కళాశాలలు » ప్రథమ సంవత్సరంలో 26,040 సీట్లు



భువనగిరి టౌన్, మే 5: డిగ్రీలో ప్రవేశాలకు నేటినుంచి దోస్త్ విధానంలో అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం కానుంది. మూడు దశల్లో అడ్మిషన్ల పూర్తయ్యాక జూలై 7వ తేదీ నుంచి డిగ్రీ ప్రథమ సంవత్సరం తరగతులు ప్రారంభమవుతాయి. ఆన్‌లైన్‌లోనే దరఖాస్తులు, వెబ్ ఆప్షన్స్, సీట్ల కేటాయింపు ఉంటుంది. సీటు కేటాయించిన కళాశాలలో విద్యార్థులు రిపోర్టింగ్ చేసి చేరాల్సి ఉంటుంది. మే 6 నుంచి జూన్ 19వ తేదీ వరకు విద్యార్థులు, తల్లిదండ్రులు స్మార్ట్ ఫోన్లు, నెట్ సెంటర్ల సందర్శనలో బిజీగా ఉండనున్నారు. ఇంటర్ పూర్తయ్యాక ఇంజనీరింగ్, మెడికల్, ఎల్ఎల్‌బీ తదితర వృత్తి విద్యా కోర్సులకు అవకాశం ఉన్నా పలు రంగాల్లో స్థిరపడేందుకు డిగ్రీ విద్యనే ఉత్తమమని పలు రంగాల నిపుణులు పేర్కొంటున్నారు. దోస్త్ ప్రక్రియ ప్రారంభం కావడంతో నచ్చిన కళాశాల, నచ్చిన కోర్సులో చేరేందుకు విద్యార్థులు అవగాహనతో వ్యవహరించాలని సూచిస్తున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 75 ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ డిగ్రీ కళాశాలల్లో పలు కోర్సుల్లో 26,040 సీట్లు అందుబాటులో ఉన్నాయి.

ఉన్నత విద్యకు డిగ్రీ రాజమార్గం

మారిన ఆలోచనా విధానాల ఫలితంగా ఒకే తరహా విద్యను అభ్యసించి జీవితమంతా అదే లైన్‌లో ఉద్యోగం చేస్తూ జీవితాలను గడపాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. ముఖ్యంగా ఇంజనీరింగ్ కోర్సులు చదివే వారిలో ఈ తరహా వైఖరి మరింత బలంగా ఉంటుంది. ఇంజనీరింగ్ చదివిన వెంటనే లక్షల ప్యాకేజీతో ఉద్యోగాలు లభిస్తాయి. అవకాశం, అదృష్టం కలిసి వస్తే విదేశాల్లో స్థిరపడవచ్చునని పలువురు ఆశిస్తున్నారు. అందుకు అనుగుణంగా కొద్ది మందికి ఆ తరహా అవకాశాలు కలిసి వస్తున్నాయి. పలు కారణాలతో ఇంజనీరింగ్, తదితర వృత్తి విద్యా కోర్సులను అర్ధంతరంగానే వదిలివేస్తున్న వారి సంఖ్య, కోర్సులు పూర్తయినప్పటికీ ఉద్యోగాలు లభించని వారి సంఖ్య క్రమేపీ పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తున్న అంశం. డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులకు మాత్రం పలు ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాలు లభించే అవకాశాలు క్రమేపీ పెరుగుతున్నాయని ఉద్యోగ రంగ నిపుణులు పేర్కొంటున్నారు. డిగ్రీ పూర్తయ్యాక పీజీ, పీహెచ్‌డీ, తదితర ఉన్నత విద్యను చదవగలిగితే అన్ని రంగాల్లో ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయని విద్యావేత్తలు అంటున్నారు. దీంతో కేవలం వృత్తి విద్యా కోర్సులను మాత్రమే చదవాలనే మూస ధోరణి విడనాడి డిగ్రీలోనూ ఉత్తమ కోర్సులను ఎంపిక చేసుకోగలిగితే భవిష్యత్తు భద్రంగా ఉంటుందని విద్యావేత్తలు సూచిస్తున్నారు. ఇంటర్ ఒకేషనల్ కోర్సులు కూడా డిగ్రీ ప్రవేశాల తగ్గుదలకు కారణమవుతోంది. డిగ్రీలో ప్రస్తుతం ఉన్న కోర్సులకు అదనంగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం నాలుగు నూతన కోర్సులు అందుబాటులోకి తెచ్చింది. ఉమ్మడి జిల్లాలోని పలు కళాశాలల్లో బయో మెడికల్ సైన్స్, బీకాం ఫైనాన్స్ అండ్ ట్యాక్సేషన్ కోర్సులు అందుబాటులోకి వచ్చాయి.

అంశం	తేదీ
తొలి దశ రిజిస్ట్రేషన్	06-05-2024 నుంచి 25 వరకు
వెబ్ ఆప్షన్ల నమోదు	15-05-2024 నుంచి 27 వరకు
సీట్ల కేటాయింపు	జూన్ 3వ తేదీన
ఆన్‌లైన్ రిపోర్టింగ్	04-05-2024 నుంచి 10 వరకు
రెండో దశ రిజిస్ట్రేషన్	04-06-2024 నుంచి 13 వరకు
వెబ్ ఆప్షన్ల నమోదు	04-06-2024 నుంచి 14 వరకకు
సీట్ల కేటాయింపు	జూన్ 18వ తేదీన
ఆన్‌లైన్ రిపోర్టింగ్	19-06-2024 నుంచి 24 వరకు
మూడో దశ రిజిస్ట్రేషన్	19-06-2024 నుంచి 25 వరకు
వెబ్ ఆప్షన్ల నమోదు	19-06-2024 నుంచి 26 వరకు
సీట్ల కేటాయింపు	జూన్ 29న
ఆన్‌లైన్ రిపోర్టింగ్	జూన్ 29 నుంచి జూలై 3 వరకు
తరగతుల ప్రారంభం	జూలై 7 నుంచి

ఉమ్మడి జిల్లాలో డిగ్రీ కళాశాలలు సీట్లు ఇలా..

యాజమాన్యం	కళాశాలలు	సీట్లు ప్రథమ సంవత్సరం	గత సంవత్సరం ప్రవేశాలు
ప్రభుత్వం	11	6,120	3,976
ఏయిడెడ్	02	1,260	700
ప్రైవేట్	62	18,660	5,472
మొత్తం	75	26,040	10,148

దోస్త్, సెమిస్టర్ విధానాలతోనే తగ్గుతున్న ప్రవేశాలు



దోస్త్, సెమిస్టర్ విధానాలతోనే డిగ్రీలో ప్రవేశాలు తగ్గుతున్నాయి. ఆ రెండు విధానాల అమలుకు ముందు కళాశాలలో ప్రవేశాలు గణనీయంగా ఉండేవి. దోస్త్ పేరిట ఆన్‌లైన్‌లో ప్రవేశాల ప్రక్రియ ప్రారంభంతో అవగాహన లేమితో పలువురు విద్యార్థులు సకాలంలో చేరలేక పోతున్నారు. సెమిస్టర్ విధానం వాస్తవంగా ఉపయుక్తమైనప్పటికీ అకాడమిక్ ఇయర్ నిర్వాహణలో తలెత్తుతున్న లోపాలతో విద్యార్థులు పరీక్షలకు సన్నాహం అయ్యేందుకు అవకాశం లభించకపోతుండడంతో పలువురు విద్యార్థులు పరీక్షల్లో ఫెయిల్ అవుతూ అర్థాంతరంగా డిగ్రీ విద్య నుంచి డ్రాప్‌అవుట్ అవుతున్నారు. ఆ రెండు విధానాలకు సమూలంగా సవరించాలి.

- డాక్టర్ బి సూర్యనారాయణరెడ్డి, అధ్యక్షుడు, తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాల అసోసియేషన్.

డిగ్రీ విద్యకు దూరమవుతున్న సైన్స్ విద్యార్థులు



డిగ్రీ విద్యకు సైన్స్ విద్యార్థులు దూరమవుతున్నారు. ఆర్ట్స్ గ్రూపులలో ప్రవేశాలు ఓ మోస్తారుగానే ఉంటున్నాయి. ఎంసెట్, ఎంబీబీఎస్, ఇంజనీరింగ్ తదితర వృత్తి విద్యా కోర్సుల పట్ల సైన్స్ విద్యార్థులు ఆసక్తి చూపుతుండడంతో డిగ్రీలో చేరే సైన్స్ విద్యార్థులు తగ్గుతున్నారు. కానీ డిగ్రీలో సైన్స్ గ్రూప్‌లు చదువుకున్న విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుంది. డిగ్రీతో పాటు పీజీ పూర్తి చేస్తే ఫార్మా పరిశ్రమలు, ఆసుపత్రులు, బోధన రంగంతో పాటు పలు పలు రంగాల్లో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయి. అవకాశాల పట్ల విద్యార్థులతో పాటు తల్లిదండ్రులకు అవగాహన కొరవడుతుండడంతో సైన్స్ ప్రవేశాలు తగ్గుతున్నాయి.

- హరిత, ఫిజిక్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్, ఆలేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల.

ఉమ్మడి జిల్లాలో



ఉమ్మడి జిల్లాలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీ (ఎంజీయూ) పరిధిలో 75 ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరంలో 26,040 సీట్లు అందుబాటులో ఉన్నాయి. గత విద్యా సంవత్సరంలో కేవలం 10,148 మంది మాత్రమే ప్రథమ సంవత్సరంలో చేరారు. గత విద్యా సంవత్సరంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ సంవత్సరాలలో కేవలం 22వేల మంది విద్యార్థులు డిగ్రీ కోర్సులు అభ్యసించారు.

లోపభూయిష్టంగా దోస్త్, సెమిస్టర్

ఉన్నత విద్యలో సంస్కరణల పేరిట 2016 నుంచి డిగ్రీ విద్యలో ఆన్‌లైన్ విధానంలో ప్రవేశాలకు దోస్త్, పరీక్షలలో సెమిస్టర్ విధానాన్ని అమల్లోకి తెచ్చారు. వాస్తవానికి ఆ రెండు విధానాలు మంచివే అయినప్పటికీ అమలు చేస్తున్న తీరులో తలెత్తుతున్న లోపాలతో డిగ్రీలో ప్రవేశాలు తగ్గుతుండడంతో పాటు అర్ధంతరంగా డ్రాప్‌అవుట్స్ పెరుగుతున్నాయని విశ్లేషకులు చెబుతున్నారు. డిగ్రీలో చేరగోరే విద్యార్థికి ఆన్‌లైన్‌లో మూడు దశల తర్వాత కళాశాల, సీటు కేటాయింపు జరుగుతుంది. ప్రతి దశలో తన సెల్ ఫోన్‌కు వచ్చే మెసేజ్ పట్ల అప్రమత్తంగా ఉండాల్సిందే కానీ గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులకు కూడా సెల్ ఫోన్లు లేకపోవడం, రిజిస్ట్రేషన్ సమయంలో ఇచ్చిన సెల్ నెంబర్లు మారుతుండడం తదితర కారణాలతో సకాలంలో స్పందించకపోతుండడంతో డిగ్రీ ప్రవేశాలకు దూరమవుతున్నారు. ఎంసెట్ తదితర వృత్తి విద్యా కోర్సుల ప్రవేశాలు, డిగ్రీ ప్రవేశాల మధ్య ఉన్న తారతమ్యం కూడా డిగ్రీ ప్రవేశాలకు అడ్డంకిగా మారుతోంది. ఉన్నత విద్యా మండలి నిబంధనల ప్రకారం 90రోజుల పని దినాల అనంతరమే సెమిస్టర్ పరీక్షలు జరుగాల్సి ఉంటుంది. రెండు సంవత్సరాలతో పోలిస్తే 60 నుంచి 70పని దినాల అనంతరం సెమిస్టర్ పరీక్షలు నిర్వహిస్తుండడంతో సిలబస్ పూర్తి కాకపోతుండడంతో విద్యార్థులు ఫెయిల్ అవుతూ అర్ధంతరంగానే డిగ్రీ విద్యకు దూరమవుతున్నారు. డిగ్రీ విద్య, విద్యార్థుల భవిష్యత్తు భద్రంగా ఉండాలంటే ఆ రెండు విధానాలను మార్చాల్సిందేనని విద్యావేత్తలు పేర్కొంటున్నారు.

పట్టుకోండి చూద్దాం..ఆపేదెవరు?

● ఇసుక అక్రమార్కుల ధీమా ● పట్టించుకోని అధికారులు

తిరుమలగిరి మునిసిపాలిటీలోని అనంతారం, నందాపురం, మండలంలోని తాటిపాముల, నాగా రం మండలంలోని పలు గ్రామాల్లో ఇసుక అక్రమ దందా జోరుగా సాగుతోంది. బిక్కేరు వాగు నుంచి ఇసుకను తవ్వి, తిరుమలగిరి మునిసిపల్ కేంద్రం, సరిహద్దు జిల్లాలైనన జనగాం, మహబూబాబాద్‌కు అక్రమంగా తరలిస్తున్నారు. రాత్రి వేళల్లో వందల ట్రాక్ట ర్లు యథే చ్ఛగా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. పట్టుకోండి చూ ద్దాం.. ఆపేదెవరు? అని ఇసుక అక్రమ వ్యాపారులు బహిరంగం గా వ్యాఖ్యానిస్తున్నట్లు తెలిసింది. ఒకవేళ పట్టుకు న్నా, బడా నాయకులతో ఫోన్లు చేయించి, నిమిషాల వ్యవధి లో విడిపించుకుని తీసుకువెళుతున్నట్లు తెలిసింది. 20 రోజుల క్రితం రెండు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకుని స్టేషన్‌కు తరలిస్తే, ఓ అధికార పార్టీ నాయకుడు, బడా నాయకుడితో మాట్లాడించి, జరిమానా లేకుండా ట్రాక్టర్లను విడిపించుకుని వెళ్లినట్లు సమాచారం.

- తిరుమలగిరి





ఇసుకను పోస్తున్న ట్రాక్టర్, బిక్కేరు వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్

తిరుమలగిరి మునిసిపాలిటీ కేంద్రంలో క్రాస్ రోడ్డులో ఇసుక అక్రమ వ్యాపారులు గుంపులుగుంపులు గా పహారా కాస్తూ, పోలీసుల రాకపోకలను ఇసుక ట్రా క్టర్ల డ్రైవర్లకు చేరవేస్తూ ట్రాక్టర్లను తప్పిస్తున్నట్లు తెలిసింది. ఈ తంతుకు కొంతమంది పోలీసు సిబ్బంది సహకరిస్తు న్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొంతమంది పోలీసు సిబ్బంది సహకారం,అధికార పార్టీ నా యకుల అండదండలతో ఇసుకను అక్రమంగా తరలి స్తూ వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు.ఇసుక అక్ర మ రవాణాపై ఎవరైనా డయల్ 100కు సమాచారం ఇస్తే, ఫోన్ చేసిన వారి వివరాలను పోలీసులు సిబ్బంది, ఇసుక అక్రమ వ్యాపారులకు చేరవేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.దీంతో డయల్ 100కు ఫోన్ చేసిన వారిని ఇసుక అక్రమ వ్యాపారులు బెదిరిస్తున్నట్లు తెలిసింది.

నిఘా ఏర్పాటు చేస్తున్నాం

పోలీస్‌స్టేషన్‌లో సిబ్బంది కొరత ఉంది. ఎలక్షన్ విధులకు కొంతమంది సిబ్బంది వెళ్లినందున ఇసుక అక్రమ రవాణా పై పూర్తి నిఘా పెట్టలేకపోతున్నాం. నిత్యం గస్తీ కాస్తు న్నాం. ఇసుక ట్రాక్టర్లను పట్టుకుని కేసులు నమోదు చేస్తున్నాం. ఇసుక అక్రమ రవాణాపై ప్రజలు పోలీసులకు సమాచారం ఇవ్వాలి. రాత్రి వేళల్లో గస్తీని పెంచుతాం.

- సత్యనారాయణ, ఎస్ఐ, తిరుమలగిరి

డ్రైవర్లంతా మైనర్లే

ఇసుక అక్రమ రవాణాకు డ్రైవర్లుగా మైనర్లనే వ్యాపా రులు నియమించుకుంటున్నారు. వీరిలో చాలామంది పదో తరగతి, ఇంటర్ విద్యార్థులే ఉంటున్నారు. రోజువారి ఖర్చుల కోసం వారు డ్రైవర్లుగా పనిచేస్తున్నారు. రాష్ డ్రైవింగ్, సెల్‌ఫోన్ మాట్లాడుతూ పలు ప్రమాదాలకు కారణమవుతున్నారు. పిల్లలను జల్సాలకు అలవాటు చేసి జీవితాలను ఆగమాగం చేస్తూ, ట్రాక్టర్ల యజమానులు మాత్రం జేబులు నింపుకుంటున్నారని తల్లిదం డ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రాత్రి 8గంటల నుంచి..

రాత్రి ఎనిమిది గంటల నుంచి ఉదయం ఎనిమిది గంటల వరకు తిరుమల గిరి మండలం అనంతారం గ్రామస్థులు పెద్ద సంఖ్యలో బిక్కేరు వాగులో ఇసుకను తవ్వి ట్రాక్ట ర్లకు ఎత్తుతున్నట్లు సమాచారం. ఇసుక ట్రాక్టర్ల రాక పోకల శబ్దాలకు రాత్రి వేళల్లో నిద్ర కూడా కరువైం దని అంబేడ్కర్‌నగర్ కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇసుక అక్రమ రవాణాను అధికారులు పట్టించుకోకపోవడంపై స్థానికుల విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇసుక అక్రమ వ్యాపారులపై చర్యలు తీసుకుని రవాణాను అరికట్టాలని కోరుతున్నారు.

రామిశెట్టి బ్రహ్మం ఆశయాలు సాధించాలి



బ్రహ్మం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

హుజూర్‌నగర్ రూరల్, మే 5: సీపీఐ నేత రామిశెట్టి బ్రహ్మం ఆశయాలు సాధించాలని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు యల్లావుల రాములు, గుండు వెంకటేశ్వర్లు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కంబాల శ్రీనివాస్ కోరారు. ఆదివారం పట్టణంలోని లింగగిరి రోడ్డులో బ్రహ్మం విశ్రాంత ప్రాంగణంలో బ్రహ్మం 22వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో జరిగిన అనేక పోరాటాల్లో బ్రహ్మం కీలకపాత్ర పోషించాడన్నారు. కార్యక్రమంలో రామిశెట్టి వీరనారాయణ, రాము, జ్యోతి, శాంతి, కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కొప్పోజు సూర్యనారాయణ, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు జడ శ్రీనివాస్, జక్కుల రమేష్, యల్లావుల రమేష్, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు దొంతగాని సత్యనారాయణ, ఇందిరాల వెంకటేశ్వర్లు, వాసుదేవరావు, బంటు శ్రీను, కుక్కడపు శ్రీను, సోమగాని కృష్ణ పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

ఆత్మకూర్(ఎస్), మే 5: మండలంలోని మక్తాకొత్తగూడెం గ్రామంలో విఘ్నేశ్వర యూత్ ఆధ్వర్యంలో ఆదివారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. బాటసారుల దాహార్తిని తీర్చడం కోసం చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు యూత్ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో చామకూరి మధు, జి.నర్సయ్య, ఎం గంగరాజు, మహేష్ పాల్గొన్నారు.

పేదలపై భారం మోపిన బీజేపీ ప్రభుత్వం

మఠంపల్లి, మే 5: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సంపన్నులకు రూ.లక్షల కోట్ల రాయితీలు ప్రకటించి, పేదలపై ధరల భారం మోపిందని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు భూక్యా పాండునాయక్ విమర్శించారు. ఆదివారం మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన ఆ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర దర్యాప్తు సంస్థలను కేంద్ర ప్రభుత్వం దుర్వినియోగం చేసి ప్రతిపక్షాల నాయకులపై అక్రమ కేసులు పెట్టించి జైలుకు పంపిందన్నారు. ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న బీజేపీకి పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి మాలోతు బాలునాయక్, నాయకులు శాగంరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, రన్‌మియా, కోటయ్య, రాము శంభయ్య, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందన

కోదాడ టౌన్, మే 5: పట్టణంలోని 18వ వార్డు గణేష్‌నగర్‌కు చెందిన ఎలమర్తి ప్రహర్షిని శ్రీవిద్య కాలేజీలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. ఎంపీసీ విభాగంలో 460/470మార్కులు సాధించడంతో ప్రహర్షిని, ఆమె తల్లిదండ్రులను గణేష్‌నగర్ వాసులు ఆదివారం అభినందించారు. కార్యక్రమంలో పెదనాటి నరసింహారావు, కనగాల రాధాకృష్ణ. ఎం.ప్రభాకర్‌రావు, మస్తాన్, దాసు శ్రీనివాస్‌రెడ్డి, ఆర్.కోటేశ్వరరావు, గురునాథం, పి.ప్రసాద్, నరేష్, హరిబాబు, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

మూడు రోజుల్లో 396ఓట్లు పోలింగ్

హుజూర్‌నగర్, మే 5: హుజూర్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో మూడో రోజుల్లో హోమ్ ఓట్లు, పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 396 పోలైనట్లు అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం హుజూర్‌నగర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల మూడో 28ఓట్లు, నాలుగో తేదీన 165ఓట్లు, ఐదో తేదీన 203ఓట్లు మొత్తం కలిపి 39 ఓట్లు పోలైయ్యాయని తెలిపారు. పట్టణంలోని వీవీఎం పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఓట్లు వేసినట్లు తెలిపారు. కాగా హోమ్ ఓట్లకు 232మంది, ఉద్యోగుల పోస్టల్ బ్యాలెట్ ఓట్ల కోసం 1900 మంది దరఖాస్తు చేసుకున్నట్లు వెల్లడించారు. ఇప్పటివరకు హోమ్ ఓట్లను 221మంది వేసినట్లు తెలిపారు.

మాజీ సర్పంచ్ లింగయ్య మృతి



లింగయ్య (ఫైల్ ఫొటో)

మోతె, మే 5: మండలంలోని నామవరం గ్రామానికి చెందిన దైద లింగయ్య (72) అనారోగ్యంతో హైదరాబాద్‌లో చికిత్సపొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. రెండు పర్యాయాలు యూసీసీఆర్ఐ(ఎంఎల్) పార్టీ నుంచి రెండు పర్యాయాలు సర్పంచ్‌గా గెలిచారు. నల్లగొండ ఎంపీగా పోటీ చేసి ఓడిపోయారు. గ్రామంలో భూస్వాములు, పెత్తందార్లకు వ్యతిరేకంగా ప్రజలతో కలిసి పోరాటాలు చేశారు. రాజకీయ కక్షలతో కొంత కాలం జైలు జీవితం గడిపారు. లింగయ్య మృతి పార్టీకి తీరనిలోటని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు వీరభద్రయ్య, ఖమ్మం జిల్లా ప్రతినిధి ముత్తయ్య అన్నారు. గ్రామంలో నిర్వహించిన లింగయ్య అంతిమయాత్రలో నాయకులు పాలకూరి యల్లయ్య, తండు మల్సూరు, సామ వేణు గోపాల్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, సరసాని సుధాకర్‌రెడ్డి వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

'నేటి బీజేపీ సభను విజయవంతం చేయాలి'

చిలుకూరు, మే 5: పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం నల్లగొండలో నిర్వహించే బీజేపీ జిల్లా సంకల్ప సభకు కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అక్కిరాజు యశ్వంత్ సూచించారు. ఆదివారం చిలుకూరు మండలంలోని బేతవోలులో నిర్వహించిన బీజేపీ సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. కోరారు. ఈ ప్రచార బహిరంగ సభకు బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా హాజరవుతున్నట్లు తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో నల్లగొండ స్థానం నుంచి పోటీ చేస్తున్న బీజేపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి విజయానికి కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు బొలిశెట్టి కృష్ణయ్య, మండల ఇన్‌చార్జి యాదా రమేష్, మండల అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్‌రెడ్డి, బత్తిని శ్రీనివాస్, మోదుగు కృష్ణారెడ్డి, బత్తిని రామారావు, బసవయ్య, నాగాచారి, అజ్మీరా మనోజ్, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయబద్ధంగా లక్ష్మీనృసింహుని కల్యాణం

మఠంపల్లి, మే 5: మండలంలోని మట్టపల్లి క్షేత్రంలో ఆదివారం లక్ష్మీనృసింహుని నిత్య కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాసన అనంతరం స్వామివారికి మాంగల్యధారణ, తలంబ్రాలతో నిత్య కల్యాణాన్ని జరిపించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు చెన్నూరి విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈవో సిరికొండ నవీన్, అర్చకులు తూమాటి శ్రీనివాసాచార్యులు, పద్మనాభాచార్యులు, కృష్ణమాచార్యులు, రామాచార్యులు, ఫణిభూషణమంగాచార్యులు, నరసింహమూర్తి, లక్ష్మీనరసింహమూర్తి, సీతారామశాస్త్రి, శేషగిరిరావు, తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నపేటలో అలివేలుమంగ, వేంకటేశ్వరస్వామికి..

గరిడేపల్లి, మే 5: మండలంలోని అప్పన్నపేట గ్రామంలో వేంకటేశ్వరస్వామి శాంతి కల్యాణాన్ని ఆదివారం కన్నుల పండువగా నిర్వహించారు. ఉదయం ఐదు గంటలకు సుప్రభాత సేవ, తోరణ అలంకరణ, కంకణధారణ, ఎదుర్కోళ్లు, అనంతరం కల్యాణం జరిపారు. సాయంత్రం గ్రామ వీధుల్లో స్వాముల విగ్రహాలను ఊరేగించారు. కల్యాణం సందర్భంగా గ్రామంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో పూజారి నర్సింహాచార్యులు, మాజీ సర్పంచ్ యడవెల్లి చంద్రారెడ్డి, ఎంపీటీసీ కడప ఇసాక్, యడవెల్లి బాలు, లింగనబోయిన రామకృష్ణ, జలగం వెంకటేశ్వర్లు, పెండెం గుర్వయ్య అధిక సంఖ్యలో భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

గాలివాన బీభత్సం



ఆత్మకూర్ మండలం ఏపూర్‌లో చెట్టు కూలడంతో చనిపోయిన గేదె, రామన్నగూడెం గ్రామంలో పిడుగుపాటుకు మృతిచెందిన ఎద్దు



బోరింగ్‌తండాలో కూలిన రేషన్ షాపు, పాత సూర్యాపేటలో కూలిన ఇంటిపైకప్పు



పాతపహాడ్లలో చెట్టు కూలడంతో ఆగిన అంబులెన్సు

నియోజకవర్గంలో 273మంది బైండోవర్



మట్టపల్లి వంతెన వద్ద కారును తనిఖీ చేస్తున్న సీఐ, పోలీసులు

మఠంపల్లి, మే 5: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో నియోజకవర్గంలో వివిధ కేసుల్లో ఉన్న 273మంది ట్రబుల్ మాంగర్స్, రౌడీ షీటర్లను ఆయా మండలాల తహసీల్దార్ల ఎదుట బైండోవర్ చేశామని సీఐ గజ్జెల చరమందరాజు తెలిపారు. మట్టపల్లి కృష్ణానది వంతెన సమీపంలో ఏర్పాటు చేసిన తెలంగాణ-ఆంధ్రా రాష్ట్రాల సరిహద్దు చెక్‌పోస్టును ఆయన ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సరిహద్దు చెక్‌పోస్టులో నిరంతరం వాహనాలను తనిఖీ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఇప్పటివరకు నియోజకవర్గంలో బెల్టుషాపులు నడుపుతున్న 33మందిపై కేసులు నమోదు చేశామన్నారు. నియోజకవర్గంలో మట్టపల్లి, నేరేడుచర్ల, మహంకాళిగూడెం ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటుచేశామన్నారు. ఇరు రాష్ట్రాలతో సంబంధం ఉన్న వ్యక్తుల బ్యాంకు లావాదేవీలపై ప్రత్యేక దృష్టిసారించాలని, ఫ్లయింగ్ స్క్వాడ్, జీఎస్టీ, ఎస్‌జీటీ టీంలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, అనుమానిత వ్యక్తులను అదుపులోకి తీసుకోవాలని, మద్యం, పీడీఎస్ బియ్యం, డబ్బు, బంగారం అక్రమంగా తరలిస్తుంటే సీజ్ చేయాలని, ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఆధారాలు లేకుండా రూ.50 వేలకు మించి నగదు, ఇతర వస్తువులు తీసుకువెళ్ల కూడదన్నారు. ఎన్నికలు ముగిసే వరకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ఎన్నికలు సజావుగా జరిగేలా ప్రజలు, వివిధ శాఖల అధికారులు సహకరించాలని సీఐ కోరారు.

దోపిడీ వ్యవస్థపై గర్జించిన రామారావు

కోదాడ టౌన్, ఆత్మకూర్(ఎస్) మే 5: దోపిడీ వ్యవస్థపై గర్జించిన నాయకుడు అరుణోదయ రామారావు అని పలువురు సీపీఐ(ఎంఎల్) నాయకులు అన్నారు. 'అరుణోదయ' ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సీనియర్ కళాకారుడు అరుణోదయ రామారావు ఐదో వర్ధంతి సందర్భంగా అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో ఆదివారం కోదాడలోని లాల్ బంగ్లాలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా అరుణోదయ సంస్థ జిల్లా అధ్యక్షుడు ఉదయగిరి పేదలకు అరుణోదయ రామారావు పోరాడారని కొనియాడారు. దోపిడీ వ్యవస్థ పోవాలని, సమ సమాజం రావాలని తన పాట-ఆటల ద్వారా ప్రజలను చైతన్యం చేసిన విప్లవ కళాకారుడు రామారావు అని అన్నారు. రామారావు ఆశయాలను నేటి యువత సాధించాలని అన్నారు. కార్యక్రమంలో వి.నరసింహారావు, ఏ.సత్యనారాయణరెడ్డి, అనంతరామయ్య, వీరబాబు, మైసయ్య, కొండలు, సలీం సైదులు, నగేష్, గోపి పాల్గొన్నారు.

● అరుణోదయ రామారావు ఐదో వర్ధంతి సందర్భంగా ఆత్మకూర్(ఎస్) మండలంలోని బొప్పారం గ్రామంలో ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎర్ర ఉమేష్, మధు, సుధాకర్‌రెడ్డి, సోమిరెడ్డి, ఉపేందర్‌రెడ్డి, ఉపేందర్, గణేష్, లింగయ్య, రాంబాబు పాల్గొన్నారు.



కోదాడలో అరుణోదయ రామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

విద్యార్థికి సైనిక్ స్కూల్లో సీటు

హుజూర్‌నగర్, మే 5: మండలంలోని వేపలసింగారం గ్రామానికి చెందిన నవనీత్‌కుమార్ సైనిక్ స్కూల్లో సీటు సాధించాడు. కీసరలోని ఎస్సీ గురుకుల పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న నవనీత్ కుమార్, ఆరో తరగతి ప్రవేశ పరీక్షలో కరీంనగర్ జిల్లాలోని రుక్మాపూర్ సైనిక పాఠశాలలో సీటు సాధించాడు.

బీఆర్ఎస్ పాలనలోనే రాష్ట్రం అభివృద్ధి



నేరేడుచర్లలో మాట్లాడుతున్న జగదీష్‌రెడ్డి

నేరేడుచర్ల, సూర్యా పేట టౌన్, హుజూర్‌నగర్, మునగాల రూరల్, మే 5: కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి నేరేడుచర్ల మండలం దిర్శించర్లలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించారని ఆరోపించారు. సాగునీరు అందించలేక పొలాలు ఎండబెట్టారని ఆరోపించారు. నీటిపారుదల మంత్రిగా ఉన్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సాగర్ డ్యాంనుంచి నీటిని విడుదల చేయించలేకపోయారన్నారు. నల్లగొండ స్థానం నుంచి బరిలో ఉన్న బీఆర్ఎస్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డిని గెలిపించాలని కోరారు. సమావేశంలో ఒంటెద్దు నర్సింహారెడ్డి, అప్పిరెడ్డి, సురేష్‌బాబు,సైదులు పాల్గొన్నారు.

● రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన అస్తవ్యస్తంగా ఉందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి సతీమణి సునీత అన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డిని గెలిపించాలని కోరుతూ ఆదివారం జిల్లా కేంద్రంలోని పలు వార్డుల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ అన్నపూర్ణ, తాహేర్‌పాషా, సుధారాణి పాల్గొన్నారు.

● పదేళ్ల పాలనలో రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి, అమలు చేసిన ఘనత కేసీఆర్‌ది అని హుజూర్‌నగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ కోఆర్డినేటర్ ఒంటెద్దు నర్సింహారెడ్డి అన్నారు. కంచర్ల కృష్ణారెడ్డిని గెలిపించాలని కోరుతూ ఆదివారం హుజూర్‌నగర్ పట్టణంలోని పలు ప్రాంతాల్లో, నేరేడేచర్లలో ఇంటింటి ప్రచారం చేశారు. కార్యక్రమంలో అమర్‌గౌడ్, నాగేశ్వరరావుఅప్పిరెడ్డిపాల్గొన్నారు.

● బీఆర్ఎస్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డిని గెలిపించాలని కోరుతూ ఆ పార్టీ నాయకులు మునగాల మండలంలోని నేలమర్రి గ్రామంలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో రమేష్, సత్యనారాయణ, సీతారాములు, నాగిరెడ్డి పాల్గొన్నారు.

ఒక్కరికి రైతు భరోసా ఇచ్చినా రాజీనామా చేస్తా: జగదీష్‌రెడ్డి

చివ్వెంల: రాష్ట్రంలో ఒక్కరికైనా రైతు భరోసా ఇచ్చినా తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి ముక్కు నేలకు రాస్తానని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. నల్లగొండ బీఆర్ఎస్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి గెలుపు కోరుతూ చివ్వెంల మండలంలో నిర్వహించిన ప్రచారంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ ఐదు నెలల పాలనలో రైతులు అప్పుల పాలయ్యారని అన్నారు. రాష్ట్రంలో 65 లక్షల మందికి ఇచ్చింది రైతు భరోసా కాదని, రైతుబంధు మాత్రమేనన్నారు. సీఎం కేసీఆర్ ఇచ్చిన పథకాలనే కొనసాగించారే తప్ప రైతు భరోసా ఇవ్వలే దన్నారు. రైతుబంధు అనేది తెలంగాణ రైతుల హక్కు అని, రైతు భరోసా పేరుతో డ్రామాలు ఆడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే రైతులకు రైతు భరోసా చెల్లించి ముక్కు నేలకు రాయాలన్నారు. డిసెంబర్ 9వతేదీన ఇవ్వాల్సిన రైతుబంధును కాంట్రాక్టర్లకు పంచిపెట్టారని ఆరోపించారు. కాంగ్రెస్ గ్రాఫ్ నానాటికీ పడిపోతోందన్నారు. రైతుల సంక్షేమానికి అనేక పథకాలను తీసుకొచ్చిన మాజీ సీఎం కేసీఆర్‌ను చాలెంజ్ చేయడానికి సీఎం రేవంత్‌రెడ్డికి సిగ్గుండాలన్నారు. కార్యక్రమంలో బడుగల లింగయ్యయాదవ్, జీవన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఐదు గ్యారెంటీలను అమలుచేశాం

కోదాడ రూరల్, హుజూర్‌నగర్, గరిడేపల్లి, సూర్యాపేట రూరల్, మే 5: పార్లమెంట్ ఎన్నికల్లో నల్లగొండ స్థానం నుంచి పోటీచేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డిని గెలిపించాలని డీసీసీబీ మాజీ చైర్మన్ ముత్తవరపు పాండురంగారావు కోరారు. ఆదివారం మండలంలోని కాపుగల్లు గ్రామంలో నిర్వహించిన ప్రచారంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీ పథకాల్లో ఐదింటిని అమలుచేశామన్నారు. కార్యక్రమంలో వెంకటాచారి, చలసాని గురవయ్య, మురళి, శ్రీను, చారి పాల్గొన్నారు.

● కాంగ్రెస్ అభ్యర్థి రఘువీర్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ కోదాడలో సీపీఎం ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎం.వెంకటేశ్వరరావు, ముత్యాలు, జుట్టుకొండ బసవయ్య బెల్లంకొండ సత్యనారాయణ, రాపోలు సూర్యనారాయణ, అల్సకాని బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

● పార్లమెంట్ ఎన్నికల్లో నల్లగొండ పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి రఘువీర్‌రెడ్డికి మద్దతు ఇస్తున్నట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సాముల రామిరెడ్డి, కార్యదర్శి జక్కుల వీరయ్య తెలిపారు. హుజూర్‌నగర్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు.మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మాజీ మంత్రి జానారెడ్డి అభ్యర్థన మేరకు రఘువీర్‌రెడ్డికి మద్దతు ఇస్తున్నామన్నారు. సమావేశంలో కాలువ శ్రీనివాస్, నట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.

● కాంగ్రెస్ అభ్యర్థి రఘువీర్‌రెడ్డిని గెలిపించాలని ఎంపీపీ గూడెపు శ్రీనివాస్ కోరారు. హుజూర్‌నగర్‌లోని శ్రీనగర్‌కాలనీ, వీవీఎం పాఠశాల ప్రాంతాల్లో ప్రభుత్వ ఉద్యోగులను కలిసి పోస్టల్ బ్యాలెట్లలో రఘువీర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు.



కాపుగల్లులో ప్రచారం చేస్తున్న ముత్తవరపు పాండు రంగారావు

● కాంగ్రెస్ అభ్యర్థి రఘువీర్‌రెడ్డినిగెలిపించాలని సీపీఐ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు కోరారు. గరిడేపల్లి మండలం కొండాయిగూడెంలో నిర్వహించిన సీపీఐ ముఖ్యనాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో కడియాల అప్పయ్య, కుందూరు వెంకటరెడ్డి, ఏసుపాదం పాల్గొన్నారు.

●కాంగ్రెస్ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డిని గెలిపించాలని మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి కోరారు. సూర్యాపేట మండలం సోలిపేట, రామచంద్రపురం, రామారం, యండ్లపల్లి గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి, కొప్పుల వేణారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కోతి గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.